నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక : 189 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 19-10-2025 | పేజీలు -8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది(దత్తపది)

(అ)ణగిమణగియుండు , నాదరించు పరుల
(రు)జువు గాను పలుకు రోజురోజు
గు(ణ)ము మంచిదైన రణముసమసిపోవు
తప్పుజేయబోకు (ము)ప్పుసుమ్ము

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


# కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ చేస్తాం



- సరైన సమయంలో దీనిపై నిర్ణయం తీసుకుంటాం
- కేంద్రహోంమంత్రి అమిత్ షా వెల్లడి

**పాట్నా, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జమ్మూ కశ్మీర్ కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ పై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా తెలిపారు. కేంద్ర పాలిత ప్రాంతైన లద్దాఖ్ విషయంలోనూ ప్రజలు లేవనెత్తిన డిమాండ్లపై కూడా 'మంచి తీర్మానం' చేస్తామని హామీ ఇచ్చారు. పాట్నాలో శనివారంనాడు జరిగిన మీడియా కాంక్లేవ్‌లో హోం మంత్రి మాట్లాడుతూ, ఉగ్రవాదం గుప్పిట్లో చిక్కిన జమ్మూకశ్మీర్ 370వ అధికరణ తర్వాత యూటర్న్ తీసుకుందని, గత తొమ్మిది నెలల్లో లోకల్ టెర్రరిస్ట్ రిక్రూట్‌మెంట్ ఒక్కటి కూడా -మిగతా 2 లో



## జీఎస్టీ సంస్కరణలతో దేశంలో కొనుగోళ్ల జోరు

- అనుకున్న దాన్ని మించి ప్రజలకు మేలు
- మీడియాతో ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్

**న్యూఢిల్లీ**
ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త జీఎస్టీ సంస్కరణల వల్ల దేశంలో కొనుగోళ్లు పెరుగుతున్నాయని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాము అనుకున్న దానికన్న ఎక్కువగానే ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. దసరా సమయంలో ప్రజలు రికార్డు స్థాయిలో చేసిన కొనుగోళ్ల ద్వారా సంస్కరణల ప్రభావం కనిపిస్తోందని చెప్పారు. జీఎస్టీ 2.0పై కేంద్రమంత్రులు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. సెప్టెంబర్ 22న తీసుకువచ్చిన సంస్కరణల వల్ల వినియోగదారుల్లో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. జీఎస్టీ 2.0 ద్వారా ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువ పన్ను తగ్గింపులు చేపట్టామన్నారు. అందువల్లే వినియోగదారులు ఆశించిన దానికంటే ఎక్కువ ప్రయోజనాలను పొందుతున్నారన్నారు. జీఎస్టీ సంస్కరణలపై నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్ (ఖతాబీబర ఉనాజీ), అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలతో దేశమంతా పండగ వాతావరణం నెలకొందని

-మిగతా 2 లో



## ప్రభుత్వానికి చెడ్డపేరు తీసొస్తే సహించను

- సొంత నిర్ణయాలను పక్కన పెట్టండి
- ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా సాగండి
- విధి నిర్వహణలో అలసత్వం తగదని గుర్తించండి
- అధికారులకు సీఎం రేవంత్ హెచ్చరిక లాంటి సూచన

**హైదరాబాద్, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సొంత నిర్ణయాలను పక్కన పెట్టండి, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా సాగండి..విధి నిర్వహణలో అలసత్వం తగదని గుర్తించండి అంటూ అధికారులకు సిఎం రేవంత్ హెచ్చరిక లాంటి సూచన చేశారు. పథకాలు, అభివృద్ధి పనుల అమల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు గడుస్తున్నా.. కొందరు అధికారుల పనితీరులో ఇంకా మార్పు రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎస్ రామకృష్ణారావు, సీఎంవో కార్యదర్శులతో సీఎం రేవంత్ శనివారం సమావేశమయ్యారు. కొందరు ముఖ్య కార్యదర్శులు, విభాగాధిపతుల -మిగతా 2 లో



బుల్లెట్ బండి పై.. ఆందోళన లో పాల్గొన్న మహేష్ గౌడ్..



బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో..



జాగృతి ఆధ్వర్యంలో ధర్నాలో పాల్గొన్న కవిత

# బీసీ జేఏసీ బంద్ సక్సెస్

## స్తంభించిన తెలంగాణ

- ట్యాంక్ బండ్ పై బైఠాయించిన మంత్రులు
- బైక్ ర్యాలీలో పీసీసీ మహేష్ కుమార్ గౌడ్
- మంచిర్యాలలో మంత్రి వివేక్ వెంకటస్వామి ఆందోళన
- సత్తుపల్లి లో మంత్రి తుమ్మల సికింద్రాబాద్ లో కొండ సురేఖ నిరసన
- ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో ఖైరతాబాద్ లో ఆటో ర్యాలీ
- బర్కత్ పురలో ఆర్ కృష్ణయ్య, పాయల్ శంకర్ నిరసన
- ఆర్టీసీ క్రాస్ రోడ్డులో బీఆర్ఎస్ మాజీ మంత్రుల ఆందోళన

**హైదరాబాద్/ అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఇచ్చిన రాష్ట్ర బంద్‌తో నేడు యావత్ తెలంగాణ స్తంభించింది. 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో చేపట్టిన ఈ మహా ఉద్యమం రాష్ట్ర చరిత్రలో ఒక కీలక ఘట్టంగా నిలిచింది. 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టేను నిరసిస్తూ, ఈ అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి శాశ్వత పరిష్కారం చూపాలని బీసీ జేఏసీ కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేసింది.

-మిగతా 2 లో





## పాక్‌లోని ప్రతి అంగుళం.. బ్రహ్మోస్ రేంజ్‌లోనే

- గతాన్ని మరచి మాట్లాడొద్దు
- ఆపరేషన్ సింధూర్ సమయంలో జరిగింది కేవలం ట్రైలర్ మాత్రమే
- పాక్ కు మరోమారు రాజ్‌నాథ్ హెచ్చరిక

**లక్నో**
పాక్ గతాన్ని మరచి ప్రేలాపనలు పేలితో చావుదెబ్బ తప్పదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటు హెచ్చరికలు చేశారు. ఆపరేషన్ సింధూరంను మరచిపోయి మాట్లాడొద్దని హెచ్చరించారు. పాక్‌లోని ప్రతి అంగుళం బ్రహ్మోస్ రేంజ్‌లోనే ఉందని గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్ ట్రైలర్ మాత్రమేనని మరోమారు దాయాది పాక్‌ని హెచ్చరించారు. బ్రహ్మోస్ క్షిపణులను సైన్యానికి అప్పగించిన నేపథ్యంలో శనివారం మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. ఆయనతో పాటు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ఉన్నారు. ఇక్కడ తొలివిడత బ్రహ్మోస్ క్షిపణులను ఉత్పత్తి చేశారు. వాటిని కేంద్ర మంత్రి సైన్యానికి అప్పగించారు. ఈ సందర్భంగా సైన్యం పరాక్రమం, సంసిద్ధతను ప్రశంసించారు. భారత్ వద్ద ఉన్న అధునాతన క్షిపణి సామర్థ్యాల నుంచి శత్రుదేశం తప్పించుకోలేదని

-మిగతా 2 లో

# ఏపీ ఉద్యోగులకు శుభవార్త

- పెండింగ్‌లో ఒక డీఏ ఇవ్వడానికి అంగీకారం
- ఉద్యోగాల సంఘాల నేతలతో భేటీలో చంద్రబాబు
- గత ప్రభుత్వం అన్నీ పెండింగ్‌లో పెట్టిందని విమర్శ



**అమరావతి,**
రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఉద్యోగ సంఘాల నేతలు, మంత్రులతో ఉండవల్లిలోని నివాసంలో సీఎం సమావేశమయ్యారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులకు ఒక డీఏ ఇవ్వాలని నిర్ణయించాం. నవంబరు ఒకటిన వారి ఖతాల్లో జమ చేస్తాం. ప్రభుత్వంపై ప్రతి నెలా రూ.160 కోట్ల అదనపు -మిగతా 2 లో

## బీసీ రిజర్వేషన్లు సాధించి తీరుతాం

- అందరి ఆమోదంతోనే ముందుకు సాగుతాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



**ఖమ్మం,**
కులగణన ఆధారంగా బీసీల రిజర్వేషన్ల కోసం శాసనసభలో అన్ని పార్టీల ఆమోదం తీసుకొని హైకోర్టు, సుప్రీంకోర్టు ద్వారా న్యాయం కోసం ముందుకెళ్లామని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. సత్తుపల్లిలో చేపట్టిన బీసీ బంద్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజల మనోభావాలకు తగ్గట్టుగా

-మిగతా 2 లో

## శ్రీవారి దర్శనం పేరుతో భక్తులకు టోకరా

### 4లక్షలు వసూలు చేసి దుండగుడు పరార్
### మోసగాడి కోసం పోలీసుల ఆరా



**తిరుమల, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిరుమల శ్రీవారి దర్శనం పేరుతో ఓ దళారీ భక్తులను మోసగించి పరారయ్యాడు. శ్రీవారి సేవా టికెట్లు ఇప్పిస్తానని తెలంగాణ భక్తుల నుంచి రూ.4 లక్షలు వసూలు చేశాడు. డబ్బులు ఆన్‌లైన్ ద్వారా వేసుకున్న అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో ఓ భక్తుడు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవారి దర్శనం కోసం పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఆ శ్రీనివాసుడిని కనులారా -మిగతా 2 లో

## తెలంగాణ ఉద్యమతరహాలో బీసీ ఉద్యమం

- రిజర్వేషన్లు ఇచ్చే పార్టీలే బంద్‌కు మద్దతు ఇవ్వడం వింత
- ఆటోలతో ర్యాలీ నిర్వహించిన జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్,**
తెలంగాణ ఉద్యమం మాదిరిగా మరో బీసీ ఉద్యమాన్ని చేపడతామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బీసీల బంద్‌కు మద్దతుగా ఆటోలతో ర్యాలీగా బయల్దేరి హైదరాబాద్ లోని ఖైరతాబాద్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి మాట్లాడారు. గంటపాటు ఖైరతాబాద్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిడ్డలు తమకు రిజర్వేషన్లు కావాలని కోరుతున్నారని.. రిజర్వేషన్లు ఇచ్చే పార్టీలే బంద్ కు మద్దతు ప్రకటించటం నవ్వులాటగా ఉందని ఎద్దేవా చేశారు. దొంగ జీవోలు ఇచ్చిన కాంగ్రెస్, బీసీ బిల్లును పాస్ చేయించాల్సిన బీజేపీలు బంద్ కు మద్దతు పేరుతో డ్రామాలు చేస్తున్నాయని మండిపడ్డారు. హంతకులే వచ్చి నివాళులు అర్పించినట్లు వ్యవహరిస్తున్నారని -మిగతా 2




## పాక్ వైమానిక దాడి.. ముగ్గురు అఫ్ఘాన్ క్రికెటర్ల మృతి

- మృతులు మొత్తం 8 మంది కాగా, వీరిలో ముగ్గురు యువ క్రికెటర్లు మృతి
- ట్రై సిరీస్ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటన

**హైదరాబాద్**
దాయాది దేశాల మధ్య కొనసాగుతున్న సరిహద్దు వివాదంలో భాగంగా పాకిస్థాన్ వైమానిక దాడులు అఫ్గానిస్థాన్ క్రికెట్ ప్రపంచంలో తీవ్ర విషాదాన్ని నింపాయి. పాక్-అఫ్గాన్ సరిహద్దుల్లోని తూర్పు అఫ్గానిస్థాన్‌లోని పాక్తిక ప్రావిన్స్‌లో పాకిస్థాన్ వైమానిక దళం (పీఏఎఫ్) జరిపిన దాడిలో ముగ్గురు యువ అఫ్గాన్ దేశవాళీ క్రికెటర్లు మృతి చెందారు.

**సంఘటన వివరాలు:**
మృతులు మొత్తం 8 మంది కాగా, వీరిలో ముగ్గురు యువ క్రికెటర్లు ఉన్నారు. ఈ క్రికెటర్లు పాకిస్థాన్, శ్రీలంకతో జరగనున్న కీలకమైన ట్రై-నేషన్ సిరీస్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే వీరు ఉర్గాన్ నుంచి శరణ్ వైపు ప్రయాణిస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.
మృతులు: మరణించిన క్రికెటర్లను కబీర్, సిబాతుల్లా, హరూన్గా గుర్తించారు. ఈ ముగ్గురు యువ ఆటగాళ్లు అఫ్గానిస్థాన్ దేశవాళీ క్రికెట్‌లో తమ ప్రతిభతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.
ప్రయాణం: ఈ ఆటగాళ్లు టోర్నమెంట్‌కు సంబంధించిన ప్రయాణంలో ఉండగా, వీరి వాహనంపై పాక్ దళాలు వైమానిక దాడి జరిపినట్లు తెలుస్తోంది. మొత్తం 8 మంది మృతి చెందడంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. -మిగతా 2 లో

# తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగులపై చర్యలు

## త్వరలోనే చట్టం తీసుకుని వచ్చి వారిని ఆదుకుంటాం

- ఉద్యోగుల జీతాల్లో కోత విధించి తల్లిదండ్రులకు అందచేస్తాం
- త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కండి
- గ్రూప-2 అభ్యర్థులకు ఉద్యోగ పత్రాలు అందచేసిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిస్సహాయకులకు సహాయం అందించడమే మన బాధ్యత అని గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. తల్లిదండ్రులు, పుట్టి పెరిగిన ఊరును అభివృద్ధి చేసుకోవడం మన బాధ్యత.. మీరందరూ అందుకు అంకితమవుతారని పూర్తి విశ్వాసం ఉందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉద్యోగార్థులు ఎవరైనా తల్లిదండ్రులను పట్టించుకోకపోతే .. మీ జీతంలో 10 నుంచి 15శాతం కోత విధించి

-మిగతా 2 లో



## కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ చేస్తాం

(మొదటి తరువాయి)

చోటుచేసుకోలేదని అన్నారు. '1990 నుంచి వేర్పాటువాద చీడపీడల్లో చిక్కుకున్న జమ్ముకశ్మీర్‌లో గుణాత్మకమైన మార్పు వచ్చింది. గతంలో సరిహద్దులకు ఆవల నుంచి టెర్రరిస్టులను పంపాల్సిన అవసరం లేదని పాక్ భావించేది. మన పిల్లల చేతుల్లో ఆయుధాలు ఉంచేది. ఇప్పుడు పరిస్థితి మారింది. జమ్మూకశ్మీర్ ప్రజలంతా తాము దేశంతో ఉన్నామని, యావత్ దేశం తమ వెంట ఉందని బలంగా విశ్వసిస్తున్నారు' అని అమిత్‌షా చెప్పారు. మ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగిందని, పంచాయతీలు, మున్సిపాలిటీలతో పాటు అసెంబ్లీకి ఎన్నికలు కూడా జరిగాయని, రాజ్యసభ ఎన్నికలు కూడా త్వరలో జరగనున్నాయని అమిత్‌షా చెప్పారు. తాను సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత కూడా ఇంతవరకూ రాష్ట్ర హోదా పునరుద్ధరణ జరగలేదంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, రాజకీయ అనివార్యతల వల్ల ఆయన అలా చెప్పి ఉండొచ్చని అన్నారు. కానీ రాష్ట్ర హోదా పునరుద్ధరణ సరైన సమయంలో జరుగుతుందని, సీఎంతో కూడా చర్చిస్తామని చెప్పారు. లద్దాఖ్‌లో ఇటీవల జరిగిన ఆందోళనను ప్రస్తావిస్తూ, లెహ్, కార్గిల్ కమిటీలతో కేంద్రం సంభాషణలు జరుపుతోందని చెప్పారు. ప్రజలు ఓర్పుతో ఉండాలని కోరారు. వారి న్యాయపరమైన డిమాండ్లపై మంచి తీర్మానం జరుగుతుందని వివరించారు. సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ విడుదల అవకాశాలపై అడిగినప్పుడు, ప్రజల డిమాండ్లపైనే తాను మాట్లాడుతున్నానని, వ్యక్తుల డిమాండ్ల గురించి కాదని అన్నారు. ఆయనకు (వాంగ్‌చుక్) సంబంధించిన కేసు కోర్టు ముందు ఉందని, సాక్ష్యాల ఆధారంగా కోర్టు నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

## జీఎస్టీ సంస్కరణలతో దేశంలో కొనుగోళ్ల జోరు

(మొదటి తరువాయి)

ఆనందం వ్యక్తం చేశారు. ఈ సంస్కరణలు దేశ ప్రజలకు ప్రధాని మోదీ ఇచ్చిన దీపావళి కానుక అని పీయూష్ గోయల్ అన్నారు. జీఎస్టీ డబుల్ ధమాకాతో మోదీ దేశప్రజల ఇంటికి లక్ష్మీదేవిని తీసుకువచ్చారన్నారు. జీఎస్టీ సంస్కరణలు అన్ని రంగాల్లో ఉత్సాహాన్ని తీసుకువచ్చాయని..వీటితో దేశంలోని అన్ని రంగాలు లాభపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణ సమయంలో దేశంలో వినియోగం, డిమాండ్ ఎలా పెరుగుతుందనే దాని గురించి అనేక అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలో వినియోగం పెరుగుతోందని.. ఈ ఏడాది దాదాపు రూ.20 లక్షల కోట్ల అదనపు వినియోగం జరిగే అవకాశం ఉందని అన్నారు. అమెరికాకు స్మార్ట్‌ఫోన్‌లను ఎగుమతి చేయడంలో భారత్ తన పొరుగు దేశాన్ని అధిగమించిందని చైనాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇది దేశం సాధించిన అతిపెద్ద విజయమన్నారు. స్మార్ట్‌ఫోన్లు తయారు చేసే పలు అతిపెద్ద కంపెనీలు వాటి తయారీలో దాదాపు 20శాతాన్ని భారత్‌లోనే చేపడుతున్నాయని పేర్కొన్నారు.

## పాక్‌లోని ప్రతి అంగుళం.. బ్రహ్మోస్ రేంజ్‌లోనే

(మొదటి తరువాయి)

వ్యాఖ్యానించారు. ఇక్కడి బ్రహ్మోస్ బృందం ఒక నెలలోనే రెండుదేశాలతో రూ.4వేల కోట్ల ఒప్పందాలు కుదుర్చుకుంది. రానున్న రోజుల్లో ఇతర దేశాల నుంచి నిపుణులు లక్నోకు తరలివస్తారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ యూనిట్ టర్నోవర్ రూ.3వేల కోట్లు అవుతుంది. ప్రతి ఏటా రూ.5వేలకోట్ల మేర జీఎస్టీ వసూలు అవుతుందని వెల్లడించారు.

## ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తే సహించను

(మొదటి తరువాయి)

పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా పాతపద్ధతిలోనే పోతామంటే కుదరదని అన్నారు. అధికారులు అలసత్వం వీడి అభివృద్ధి పనులపై దృష్టిసారించాలని హితవు పలికారు. సొంత నిర్ణయాలతో అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావొద్దని సూచించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే పనులు వేగవంతమవుతాయని, ప్రజలకు మేలు జరిగే నిర్ణయాలు, కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని దిశానిర్దేశర చేశారు. ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకొని, పనుల పురోగతిని సమీక్షించాలన్నారు. కీలక దస్త్రాలు, పనులు ఎక్కడా ఆగిపోవడానికి వీల్లేదు. కేంద్రం నుంచి గ్రాంట్లు, నిధులు రాబట్టుకునే కార్యాచరణను వెంటనే చేపట్టాలి. ఇకపై సీఎస్, సీఎంవో అధికారులు ప్రతివారం నివేదికలు అందించాలని సీఎం ఆదేశించారు.

## బీసీ రిజర్వేషన్లు సాధించి తీరుతాం

(మొదటి తరువాయి)

రాజ్యాంగబద్ధంగా అందరికీ సమన్యాయం జరిగి, రాజ్యాధికారం కల్పించాలనేదే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉద్దేశమని పేర్కొన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ పాదయాత్ర చేపట్టారని మంత్రి తుమ్మల గుర్తు చేశారు.అందరికీ విద్యా, ఉద్యోగం కల్పించాలనే గొప్ప సామాజిక విప్లవం కోసం రాహుల్ గాంధీ మేనిఫెస్టో రూపొందించారని మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. కొద్ది తేడాతో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాలేక పోయిందని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలకు ఇచ్చిన మాట ప్రకామరమే.. బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగబద్ధంగా ఉన్న అధికారాలతోనే చట్టం చేశామని పేర్కొన్నారు. చట్టబద్ధత ఇవ్వాల్సిన గవర్నర్లు, రాష్ట్రపతి పట్టించుకోవడం లేదని తుమ్మల ఆరోపించారు. న్యాయబద్ధంగా చట్టసభల్లో అమలు చేసిన కూడా సాంకేతిక కారణాలతో బీసీ రిజర్వేషన్ల అమలుకు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. గుజరాత్ రాష్ట్రంలో చట్ట సవరణ ద్వారానే ప్రధానమంత్రి మోదీ బీసీగా కన్వర్ట్ అయ్యారని మంత్రి తుమ్మల తెలిపారు. నరేంద్ర మోదీ కులం బీసీ కాకపోయినా అక్కడ రాష్ట్ర ప్రభుత్వం ఆయన సామాజిక వర్గాన్ని బీసీలో చేర్చిందని పేర్కొన్నారు. బీసీగా ప్రధానమంత్రి స్థానం దక్కించుకున్న మోదీ, తెలంగాణలో బీసీలకు న్యాయం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరావు డిమాండ్ చేశారు.

## తెలంగాణ ఉద్యమతరహాలో బీసీ ఉద్యమం

(మొదటి తరువాయి)

విమర్శించారు. బీసీ బిడ్డలను పదే పదే మోసం చేస్తున్నారని.. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి బీసీలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ బీసీ బిడ్డల పంతం దేశానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. యూనైటెడ్ ఫూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో జాగృతి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని.. బీసీ బంద్ ను విజయవంతం చేయాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నట్లు తెలిపారు. బీసీల రిజర్వేషన్లు అమలు చేసేలా టెక్నికల్ గా ప్రభుత్వాలు సరైన వాదనలు వినిపించటం లేదని కవిత విమర్శించారు. ఈ కారణంగానే బీసీలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో తీర్పులు వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ రూల్స్ ప్రకారం జనగణన నిర్వహించలేదని చెప్పారు. జీవో 9 విషయంలో కూడా కాంగ్రెస్ కు చిత్తశుద్ధి లేదని.. అందుకే కోర్టు జీవో ను కొట్టేసిందని అన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. ఇప్పటికిప్పుడే ఎన్నికలు జరగాల్సినంత తొందర ఏముంది? అని ప్రశ్నించారు. మహారాష్ట్ర, తమిళనాడు లో 5 ఏళ్ల వరకు ఎన్నికలు జరగలేదని.. బీసీలకు రిజర్వేషన్ల అంశం తేలిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ లకు బిల్లులు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ వారిని ఇబ్బంది పెడుతోందన్న ÷ర్ అయ్యారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేయాల్సిన పార్టీలు చిత్తశుద్ధిగా పనిచేయాలని తాను డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు.

# బీసీ జేఏసీ బంద్ సక్సెస్

(మొదటి తరువాయి)

**పూర్తిగా స్తంభించిన జనజీవనం**

శనివారం తెల్లవారుజాము నుంచే బంద్ ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా స్పష్టంగా కనిపించింది. ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలపడంతో.. జనజీవనం పూర్తిగా స్తంభించింది.

**రవాణా నిలిపివేత:** ఆర్టీసీ బస్సులు రోడెక్కలేదు, డిపోలకే పరిమితమయ్యాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని డిపోల ముందు బీసీ సంఘాల నేతలు, వివిధ రాజకీయ పక్షాల కార్యకర్తలు బైఠాయించి నిరసన తెలిపారు.

**షాపులు మూత:** వ్యాపార, వాణిజ్య సంస్థలు, దుకాణాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. షాపులు తెచ్చుకోలేదు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు సెలవు ప్రకటించాయి.

**ప్రయాణ కష్టాలు:** రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా పండుగలకు సొంతూళ్లకు వెళ్లాలనుకున్నవారు బస్టాండ్‌లలో పడిగాపులు కాశారు.

అత్యవసరాలకు మినహాయింపు: కేవలం ఆసుపత్రులు, మెడికల్ షాపులు, అంబులెన్స్‌లు వంటి అత్యవసర సేవలకు మాత్రమే బంద్ నుంచి మినహాయింపునిచ్చారు.

**మంత్రులు, ఎంపీల నిరసన హోరు**

బీసీ జేఏసీ బంద్‌కు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ సహా అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా ముఖ్య నేతలు ప్రత్యక్షంగా ఆందోళనలో పాల్గొన్నారు.

**ట్యాంక్ బండ్‌పై మంత్రుల బైఠాయింపు**

తెలంగాణ రాజధాని నడిబొడ్డున ట్యాంక్ బండ్‌పై మంత్రులు బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ నిరసనలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, బీసీ జేఏసీ చేపట్టిన బంద్‌లో అన్ని పార్టీల నేతలు పాల్గొనడం శుభపరిణామమని అన్నారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాకుండా అడ్డుకునేది బీజేపీయే" అని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేయాల్సినవన్నీ చేస్తున్నామని, త్వరలోనే ఈ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలుస్తామని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

**జిల్లాల్లో మంత్రుల ఆందోళన**

మంచిర్యాలలో గనులు, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆందోళనలో పాల్గొన్నారు.

సత్తుపల్లిలో జరిగిన నిరసనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సికింద్రాబాద్లో జరిగిన నిరసన కార్యక్రమంలో మంత్రి కొండ సురేఖ పాల్గొన్నారు.

**ఇతర ముఖ్య నేతల నిరసనలు**

పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బైక్ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొని బీసీల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణంగా అండగా ఉంటుందని ప్రకటించారు.

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఖైరతాబాద్ వరకు తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్మించి నిరసన తెలిపారు.

జూబ్లీ బస్టాండ్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ, "బీసీ రిజర్వేషన్లు అమలు కాదని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చెప్పారు" అని విమర్శించారు.

బర్కత్‌పురలో బీసీ నేత ఆర్ కృష్ణయ్య, బీజేపీ నాయకురాలు పాయల్ శంకర్ నిరసన తెలిపారు.

ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు ఆందోళన చేపట్టారు.

**బీసీల గళం ఢిల్లీకి చేరాలి**

బీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. బీసీల న్యాయమైన ఆకాంక్షలను కోర్టు స్టే ద్వారా అడ్డుకోవడం బాధాకరమని అన్నారు. సుప్రీంకోర్టు లేదా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ బంద్ కేవలం మొదటి దశ మాత్రమేనని, బీసీల గళం ఢిల్లీకి వినిపించేలా భవిష్యత్తులో మరింత ఉధృత పోరాటానికి సిద్ధమవుతామని జేఏసీ హెచ్చరించింది. అన్ని రాజకీయ పక్షాలు రోడ్డుపైకి రావడంలో పోటీపడ్డాయి, ఇది బీసీల ఐక్యతకు నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు.

# తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగులపై చర్యలు

(మొదటి తరువాయి)

తల్లిదండ్రుల ఖాతాలో వేస్తానని అన్నారు. ఒకటో తేదీ మీ జీతం ఎలా వస్తుందో.. అలాగే మీ తల్లిదండ్రుల అకౌంట్‌లో ఒకటో తేదీన పడుతుంది. దీని కోసం త్వరలో చట్టం తీసుకొస్తాం అని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. హైదరాబాద్ శిల్ప కళావేదికలో జరిగిన కార్యక్రమంలో గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన 783 మంది అభ్యర్థులకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ రామకృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్.. చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...శ్రీకాంతాచారి, వేణుగోపాల్‌రెడ్డి, ఈషాన్‌రెడ్డి, యాదయ్య లాంటి యువ విద్యార్థులు తమ జీవితాలను ధారపోసి.. ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. యూనివర్సిటీల్లో ఉంటూ వేలాది మంది విద్యార్థులు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. కానీ, ఆనాటి రాజకీయ పార్టీల నాయకులు.. నీళ్లు, నిధులు, నియామకాలనే నినాదాన్ని, తెలంగాణ ప్రజల బలమైన ఆకాంక్షను ఆయుధంగా మార్చుకొని పదేళ్లు రాష్ట్రంలో అధికారాన్ని చెలాయించారు. కానీ, నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోలేదు. వాళ్ల కుటుంబ సభ్యులు, బంధువర్గాన్ని ఆగర్భ శ్రీమంతులు చేయటం కోసమే పదేళ్లు పరిపాలన సాగింది. ప్రజల గురించి ఆలోచించి ఉంటే కాళేశ్వరం..కూలేశ్వరం అయి ఉండేది కాదు. రూ.లక్ష కోట్లతో కట్టిన ఒక ప్రాజెక్టు మూడేళ్లకే కూలిన ఘటన ప్రపంచంలో ఎక్కడా జరగలేదన్నారు. తన ఫామ్‌హౌజ్‌లో ఎకరా పంటపై రూ.కోటి ఆదాయం వస్తుందని ఒక పెద్దాయన చెప్పారు. ఎకరాపై రూ.కోటి ఆదాయం వచ్చే విద్యను యువత, ప్రజలకు




ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు. అలాంటి ప్రయోగం రైతులకు చెబితే రైతులంతా బాగుపడేవారు కాదా అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇచ్చింది. ప్రభుత్వ పాఠశాలలో చదవిన నేను ఈ స్థాయిలో ఉన్నానంటే మీ ఆశీర్వాదాలే కారణం. రూ.3కోట్లు తీసుకుని గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చారని గత పాలకులు ఆరోపణలు చేశారు. పేదింటి బిడ్డలు రూ.3 కోట్లు ఇచ్చి ఉద్యోగం కొనగలరా? కష్టపడి చదివిన వారిని అవమానించేలా మాట్లాడారు. రాజకీయ చౌకబారు విమర్శలు విమర్శలు ఎదుర్కొన్నప్పుడు చాలా ఆవేదన కలిగింది. గతంలో ఎన్నడూ జరగని కులగణన.. కాంగ్రెస్ పోరాటం వల్లే త్వరలో సాధ్యం కానుందని రేవంత్‌రెడ్డి అన్నారు. అమరుల ఆశయ సాధనపై వాళ్లు ఆలోచన చేసి ఉంటే మీకు ఎనిమిదేళ్ల క్రితమే ఉద్యోగాలు వచ్చేవి. వాళ్ల కుటుంబంలో పదవులు భర్తీ చేసుకున్నారు తప్ప, గ్రూప్ 2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వలేదు. పదిహేనేళ్లుగా గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీ జరగలేదంటే, ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉంటుందా? ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మేం గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేశాం. గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించి ఇవాళ నియామక పత్రాలను అందిస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు. మిమ్మల్ని తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేసే బాధ్యత టీజీపీఎస్సీ తీసుకుంది. మీరు.. మేము వేరు కాదు. మీరే మేము.. మేమే మీరు. చీకటి రోజులు పోవాలి.. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని గ్రూప్ 1 విషయంలో సమస్యలన్నింటినీ ఎదుర్కొని నియామక పత్రాలు అందజేశాం. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. గత పాలకులు ఉద్యోగాల భర్తీని అడ్డుకునేందుకు కేసులు వేసి అక్రమ సంపాదనతో ఏర్పాటు చేసుకున్న సోషల్ మీడియా వ్యవస్థతో మాపై బురద జల్లే ప్రయత్నం చేశారు. అలాంటి ఏ వ్యవస్థ మాకు లేదు.. మా వ్యవస్థనే మీరు.. ఆ వ్యవస్థలో మీరే మా కుటుంబ సభ్యులు. ఇప్పటి వరకు మీరు సామాన్యులు.. ఈ రోజు నుంచి మీరు ఆఫీసర్స్. మీ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి రైజింగ్ తెలంగాణ 2047 విజన్ డాక్యుమెంట్ కు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశంలోనే తెలంగాణను అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలి. రక్తం చెమటగా మార్చి మిమ్మల్ని ఇంతవాళ్లను చేసిన తల్లిదండ్రులను మరిచిపోవద్దు. నిస్సహాయులకు సహాయం చేయండి.. పేదలకు అండగా నిలవండి. గత పాలకుల పాపాల పుట్ట పగులుతోంది. వాళ్ల దోపిడీ గురించి మేం చెప్పడం కాదు..వాళ్ల కుటుంబ సభ్యులే చెబుతున్నారు. హాస్టల్స్ లో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయితే వాళ్లు పైశాచిక ఆనందం పొందుతున్నారు.

## పాక్ వైమానిక దాడి.. ముగ్గురు అఫ్గాన్ క్రికెటర్లు మృతి

(మొదటి తరువాయి)

**అఫ్గాన్ క్రికెట్ బోర్డు స్పందన:**

తమ యువ క్రికెటర్లను వైమానిక దాడిలో కోల్పోవడం పట్ల అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఈ దాడులు క్రీడాకారుల భద్రత, మనోధైర్యాన్ని దెబ్బతీశాయని ఆవేదన వ్యక్తం చేసింది. యువ ప్రతిభావంతులైన ఆటగాళ్లను కోల్పోవడం దేశ క్రికెట్‌కు తీరని లోటని పేర్కొంది.

**ట్రై సిరీస్ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటన:**

ఈ హృదయ విదారక ఘటన నేపథ్యంలో, అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. తమ ఆటగాళ్లు ప్రాణాలు కోల్పోవడంతో, పాకిస్థాన్, శ్రీలంకతో ఆడేందుకు సిద్ధమవుతున్న త్రైపాక్షిక (ట్రై-నేషన్) సిరీస్ నుంచి తక్షణమే వైదొలుగుతున్నట్టు అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయం టోర్నమెంట్ నిర్వహణపై తీవ్ర ప్రభావాన్ని చూపనుంది. ప్రస్తుతం పాక్-అఫ్గాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తత కొనసాగుతుండటంతో.. క్రీడా ప్రపంచంలో ఈ ఘటన కలకలం రేపింది. క్రీడాకారులు రాజకీయ సంఘర్షణల బారిన పడటం పట్ల అంతర్జాతీయ క్రీడా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మరణించిన ఆటగాళ్ల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ, అఫ్గాన్ క్రికెట్ బోర్డు తదుపరి చర్యలపై దృష్టి సారించింది.

## శ్రీవారి దర్శనం పేరుతో భక్తులకు టోకరా

(మొదటి తరువాయి)

వీక్షించి పునీతులవుతుంటారు భక్తులు. ఏడాదిలో ఒక్కసారన్నా తిరుమలకు రావాలని తపించిపోతుంటారు. అయితే తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల పట్ల కొందరు మోసపూరితంగా వ్యవహరిస్తుంటారు. శ్రీవారి దర్శనం టికెట్లు ఇస్తామని.. దగ్గరుండి శ్రీవారి దర్శనానికి ఏర్పాట్లు చేస్తామంటూ భక్తులను నమ్మబలుకు తారు. వీరి మాయమాటలు నమ్మిన కొందరు భక్తులు త్వరగా శ్రీవారి దర్శనం అవుతుందని భావించి వారికి డబ్బులు ఇస్తుంటారు. తీరా తిరుమలకు వెళ్లాక సదరు వ్యక్తి మోహం చాటేయడంతో తాము మోసపోయి నట్లు గుర్తించి లబోదిబోమంటుంటారు. ఇప్పుడు తాజాగా ఇలాంటి ఘటనే తిరుమలలో చోటు చేసుకుంది. శ్రీవారి సేవా టికెట్ల పేరుతో మోసానికి పాల్పడ్డాడు దళారి. శ్రీవారి సేవా టిక్కెట్లు ఏర్పాటు చేస్తామని ఓ దళారీ భక్తులను మోసం చేశాడు. ఏకంగా హోంమంత్రి, టీటీడీ ఉద్యోగుల పేరు చెప్పి భక్తులను బురిడీ కొట్టించాడు దళారి అశోక్. ఇతడి మాటలు నమ్మిన భక్తులు బాగానే సమర్పించారు.

## ఏపీ ఉద్యోగులకు శుభవార్త

(మొదటి తరువాయి)

భారం పడుతుంది. పోలీసులకు ఈఎల్.. ఒక ఇన్‌స్టాల్ మెంట్ ఇస్తాం. 60 రోజుల్లోపు ఉద్యోగుల మెడిక్లెయిమ్ సిస్టమ్ స్ట్రీమ్‌లైన్ చేస్తాం. ఆర్టీసీ ఉద్యోగులకు ఒక ప్రమోషన్ పెండింగ్‌లో ఉంది.. అది కూడా క్లియర్ చేస్తాం అని సీఎం తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రధాన భాగస్వామ్యులు అని, అందుకే వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించే ప్రయత్నంచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత అనేక స్ట్రక్చరల్ చేంజెస్ వచ్చాయి.. కొన్నింటిని సరిదిద్దే సమయంలో ప్రభుత్వం మారడంతో సమస్యలు ఎక్కడివి అక్కడే ఉండిపోయాయి.. మొత్తం 7 వేల కోట్ల రూపాయల డిఏ పెండింగ్ లో ఉంది.. సరెండర్ లీవ్ కు రూ. 830 కోట్లు బకాయిలు ఉన్నాయి.. గత ప్రభుత్వ హయంలో జరిగిన విధ్వంసాన్ని సరిచేయడానికి 15 నెలలు పట్టింది.. ఉద్యోగులు ఉద్యోగ సంఘాలు రాష్ట్ర అభివృద్ధి లో ప్రధాన భాగస్వాములు.. ఉద్యోగులు ఎక్కువ వచ్చారు ఆదాయం తగ్గింది.. ఉద్యోగులకు రూ. 34 వేల కోట్లు బకాయిలు ఉన్నాయి.. 4 డీఏలు పెండింగ్ ఉన్నాయి.. రూ. 7000 కోట్ల రూపాయలు డీఏ బకాయిలు వచ్చాయి.. రాష్ట్రాలు క్యాపిటల్ ఎక్స్పెండిచర్ పెంచి ఆదాయాలు పెంచుకుంటే మన వద్ద రివర్స్ అయ్యింది.. ఎక్సైజ్ లో భవిష్యత్తు ఆదాయంపైనా అప్పు తెచ్చారు అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ క్రమంలో నాలుగు పెండింగ్ డీఏలకు గాను ఒక డీఏను ఇవ్వడానికి ఒప్పుకుంది. నవంబర్ 1 నుంచి ఉద్యోగులకు ఒక డీఏ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం.. దీని కోసం ప్రతి నెలా రూ.160 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు చెప్పారు. అలాగే, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్ ను 180 రోజులు ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు.

## 2025 అక్టోబర్ 19, ఆదివారం తెలుగు పంచాంగం




మాసం -పక్షం
ఆశ్వయుజ మాసం
కృష్ణ పక్షం
తిథి
ద్వాదశి: అక్టోబర్ 18 ఉదయం 9:49 అక్టోబర్ 19 ఉదయం 9:02 వరకు
త్రయోదశి: అక్టోబర్ 19 ఉదయం 9:02 అక్టోబర్ 20 ఉదయం 8:37 వరకు
నక్షత్రం
పూర్వఫల్గుని: అక్టోబర్ 18 సాయంత్రం 8:04 అక్టోబర్ 19 రాత్రి 10:14 వరకు
ఉత్తరఫల్గుని: అక్టోబర్ 19 రాత్రి 10:14 అక్టోబర్ 20 రాత్రి 12:16 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:42 - 5:26
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:38 - 12:23
అమృతకాలం: రాత్రి 8:58- 10:34
అశుభ సమయాలు
రాహుకాలం: సాయంత్రం 4:27- 5:48
యమగండం: మధ్యాహ్నం 12:02 - 1:30
గుళికా: ఉదయం 3:00 -4:27
దుర్ముహూర్తం: మధ్యాహ్నం
4:01 - 4:49, ఉదయం 7:40 - 8:28
వర్జ్యం: ఉదయం 8:11- 9:49

# బీసీ బంద్‌కు అక్కన్నపేట్ బీజేపీ నాయకుల మద్దతు



**అక్కన్నపేట్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన బంద్‌కు అక్కన్నపేట్ మండల బీజేపీ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి నేతృత్వంలో అఖిలపక్ష నాయకులతో కలిసి ప్రభుత్వ పాఠశాల, దుకాణాలు, పెట్రోల్ బంక్, ఇతర వ్యాపార సంస్థలను బంద్ చేయించారు. బంద్ సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించారు. అఖిలపక్షం తరపున బంద్‌కు మద్దతు తెలుపుతూ బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ జనగామ వేణుగోపాలరావు, మండల ప్రధాన కార్యదర్శి చెరుకు సంపత్, గిరిజన మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు నునావత్ మోహన్ నాయక్, సందబోయిన కుమారస్వామి, బానోతు రవీందర్, జన్నరపు కళ్యాణ్, విష్ణు, మిట్టపల్లి కుమారస్వామి, మిట్టపల్లి సత్తయ్యతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీ బంద్‌తో ఢిల్లీకి సెగ తాగాలి

## జంగపెల్లి ఐలయ్య



**అక్కన్నపేట, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండల కేంద్రంలో బీసీ బంద్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపెల్లి ఐలయ్య మాట్లాడుతూబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేంతవరకు పోరాటం ఆగదన్నారు. సబ్బండ కులాల మద్దతుతో బంద్ విజయవంతమైందని తెలిపారు. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వకపోవడం బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. బీసీ బంద్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 9 ద్వారా బీసీ బిల్లును గవర్నర్‌కు పంపినా, ఆమోదం లేకపోవడం వెనుక బీజేపీ కుట్ర ఉందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగ రక్షణ ఉన్నట్టుగానే, బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజ్యాంగ సవరణల ద్వారా రిజర్వేషన్ల రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో జరిగే సుదీర్ఘ పోరాటాలకు అన్ని కుల సంఘాలు, రాజకీయ వర్గాలు కలిసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఐలయ్య పిలుపునిచ్చారు.

# బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాల్సిందే: పల్నాటి నరేష్



**మహేశ్వరం, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని పెద్దపులి నాగారం గ్రామంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాఠశాలలు, షాపులు స్వచ్ఛందంగా బంద్ చేయడం జరిగింది. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి, బీసీలకు తక్షణమే 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక వ్యవస్థాపకులు పల్నాటి నరేష్ మాట్లాడుతూ ు "స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందే. బీసీల నోటికాడ బువ్వను లాక్కోవడం అన్యాయమని, 70 సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాలు అన్యాయాన్ని ఎదుర్కొంటున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు.
మాజీ వార్డ్ సభ్యులు గొల్లూరి శ్రీశైలం మాట్లాడుతూ ు "బీసీలకు న్యాయం జరగాలి. రాజకీయంగా, సామాజికంగా సమాన హక్కులు కల్పించాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పల్నాటి నరేష్, మాజీ వార్డ్ సభ్యులు గొల్లూరి శ్రీశైలం, పల్నాటి అశోక్, యాదవ సంఘం అధ్యక్షులు పసుపుల పాండు, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కొమ్ము అనిల్, బీసీ నాయకులు పల్నాటి తిరుమలేష్, వెంకటేష్ యాదవ్, సాయికిరణ్ యాదవ్, కుమార్ యాదవ్, ముదిరాజ్ సంఘం నాయకులు ఘనపురం మల్లేష్, గాజులపల్లి నర్సింహా, రజక సంఘం నాయకులు చాకలి సిద్దులు, జర్నలిస్ట్ చిక్కిరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 42% రిజర్వేషన్లపై పోరాటం ఆగదు: ఆవుల యాదయ్య



**మహేశ్వరం, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం మండల కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుల యాదయ్య, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య నేతృత్వంలో సీపీఐ, ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆవుల యాదయ్య మాట్లాడుతూ ు "బీసీలకు 42% రిజర్వేషన్లపై పార్లమెంటులో చట్టం వచ్చే వరకు ఉద్యమం ఆగదు. జీవో. 9ను అమలు చేయాలి. బీసీలకు న్యాయం జరగాలి" అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ గౌడ్, దత్తు నాయక్, బ్రహ్మచారి, ఆర్. రమేశ్, టి. చంద్రయ్య, కాకి ఈశ్వర్, పాండు నాయక్, గణేశ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# గండు సంజీవ్ మృతి

## కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు



**జూలపల్లి, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)** జూలపల్లి మండల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గండు సంజీవ్ శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన మృతితో పెద్దపల్లి జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. శనివారం నాడు కాచపూర్ గ్రామంలోని నివాసానికి పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ రావు, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేరుకుని, సంజీవ్ ప్రార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తదుపరి అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణ రావు, స్వయంగా పాడె మోసి గౌరవం చెల్లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ"సంజీవ్ మృతి కాంగ్రెస్ పార్టీకే కాదు, ప్రజాసేవా రంగానికీ తీరని లోటు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన ఆచారి



**ఆమనగల్లు, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)** జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి నివాసానికి మర్యాద పూర్వకంగా వెళ్లి కలుసుకున్నారు. ఈ సందర్భంగా, ఈ నెల 31వ తేదీన జరగనున్న తన కుమారుడు భారత్ నిశ్చితార్థ కార్యక్రమానికి మంత్రి పాల్గొనాలని ఆహ్వానించారు. కుటుంబ పరంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ శుభకార్యానికి హాజరై ఆశీర్వదించాలని కోరారు.

# బిసి జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన మంత్రి జూపల్లి



**ఆమనగల్, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలో బిసి జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారికి ఘన స్వాగతం పలికిన ఆమనగల్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర నాయకుడు గుండ్రాతి కుమార్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, మున్సిపల్ ప్రెసిడెంట్ వసపుల మానయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్లకు మద్దతుగా మానకొండూరులో బంద్ విజయవంతం



**మానకొండూరు, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)** బిసి రిజర్వేషన్ల బంద్ లో భాగంగా ఈరోజు మానకొండూరు మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ తరపున పూర్తి మద్దతు ప్రకటిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి సభ్యుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో షాపులు అన్నింటిని బంద్ చేయించారు. బిసి సంఘాలకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ బంద్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు పిట్టల మధు, శాతరాజు యాదగిరి, ఎరుకల శ్రీనివాస్, గడ్డం సంపత్, బోడ రాజా శేఖర్, గుర్రం కిరణ్, దండబోయిన శేఖర్, దేశబోయిన ప్రవీణ్, పిండి సందీప్, నాసిర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా మానకొండూరులో కాంగ్రెస్ పార్టీ ర్యాలీ



**మానకొండూర్, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)** బీసీ రిజర్వేషన్ల బంద్ లో భాగంగా మానకొండూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి మద్దతు ప్రకటిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వరాహాల చారీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో షాపులు బంద్ చేయించి బీసీ సంఘాలకు సంపూర్ణ మద్దతు తెలిపారు. బంద్‌ను విజయవంతంగా నిర్వహించి బీసీ హక్కుల కోసం పార్టీ స్థాయిలో సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కనిగంటి మల్లికార్జున్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు సాయిరి దేవయ్య, రామిడి తిరుపతి, కొండ్రా సురేష్, బుర్ర శ్రీధర్, ఇగోలపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో బంద్



**మంచాల, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
42% బీసీ రిజర్వేషన్ కోసం బీసీలకు మద్దతుగా భారతీయ జనతా పార్టీ తరఫున బంద్ నిర్వహించారు. 76 బూత్ అధ్యక్షుల సమన్వయంతో బొడ్డుపల్లి ప్రకాష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం లోయపల్లి గ్రామంలో నిర్వహించబడింది. గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బంద్‌కు సహకారం అందించారు. బీసీ హక్కుల కోసం సంఘీభావంగా నిలిచిన ఈ కార్యక్రమంలో ఉయ్యాల భాను, చెరుకు శ్రీహరి, దోసపాటి వంశీ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా మంచాల మండలంలో బంద్ విజయవంతం



**మంచాల, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
42 శాతం బీసీ రిజర్వేషన్ కోసం మద్దతుగా మంచాల మండల కేంద్రంలో ఈరోజు బంద్ నిర్వహించబడింది. ప్రజాసంఘాలు, కుల సంఘాలు, నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ కార్యాలయాలు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలుపుతూ పాల్గొన్నారు. మండలమంతా బంద్‌కి స్పందిస్తూ సామూహికంగా సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ మాట్లాడుతూ ు "42 శాతం రిజర్వేషన్‌కు అసెంబ్లీలో మద్దతు తెలిపిన నేపథ్యంలో, రాష్ట్ర గవర్నర్ ఆమోదించాలి. పార్లమెంటులో చట్టం చేసి రాష్ట్రపతి ఆమోదం పొందాలి. తమిళనాడు తరహాలో తెలంగాణలో కూడా కులాల వారీగా రిజర్వేషన్లు అమలవ్వాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయమైన ప్రాతినిధ్యం కలగాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం మంచాల మండల అధ్యక్షుడు అశ్వల బాల్ రాజ్, జిల్లా శాలివాన సంఘం నాయకుడు ఏరుకొండ రాములు, కురుమ సంఘం నాయకుడు కళ్ళే జంగయ్య, ముదిరాజ్ సంఘం నాయకుడు గుడ్డి మల్లీచంద్రయ్య, పసుల కిష్టయ్య, అశ్వాల ముత్యాలు, దేవరకొండ ఆంజనేయులు, ఏర్పుల క్రాంతి, చేతల యాదగిరి, కాగు రాము, లక్ష్మణ్, రావుల శ్రీశైలం, రావుల బాలరాజ్, ఓరుగంటి అశోక్, చిందం శ్రీశైలం, రైతు సంఘం నాయకులు నిమ్మోజ్ చారి, చీర దానయ్య, ఓరుగంటి నవీన్, ఓరుగంటి నరేందర్, రజక సంఘం యువ నాయకులు మొగిలి మహేష్, మొగిలి వెంకటేష్, మడుగు వెంకటేష్, శ్యామల పాండు తదితరులు పాల్గొన్నారు.

# నర్సుల నిర్లక్ష్యం వల్ల గర్భిణీ మృతి



**మంచాల, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మంచాల మండల ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుల నిర్లక్ష్యం మరో ప్రాణాన్ని బలిగొన్నది. లింగంపల్లి గ్రామానికి చెందిన పంతంగి మనసా (7 నెలల గర్భిణీ) నిన్న ఉదయం 10.30 గంటల సమయంలో ఐరన్ ఇంజక్షన్ కోసం మంచాల మండల ఆసుపత్రికి వెళ్లింది. అక్కడ వైద్య సిబ్బంది ఆమె బీపీ, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించకుండా నేరుగా ఇంజక్షన్ ఇవ్వడం జరిగింది. ఇంజక్షన్ వికటించడంతో ఆమె ఆరోగ్యం విషమించిపోయింది. వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించినా చికిత్స ఫలించక తుదిశ్వాస విడిచింది. ఈ ఘటనపై గ్రామస్థులు, బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# బీసీలకు అన్యాయం జరిగితే ఉద్యమం తప్పదు

**బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాల్సిందే**
**కడ్తాల్ మండల కేంద్రంలో బంద్ విజయవంతం**





**కడ్తాల్, అక్టోబర్ 18 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలనే డిమాండ్‌తో రాష్ట్ర బంద్ కు పిలుపునిచ్చిన నేపథ్యంలో శనివారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పిప్పల్ల వెంకటేష్ మరియు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ ల ఆధ్వర్యంలో సంపూర్ణ బంద్,ర్యాలీ,రోడ్డుపై బైఠాయింపు విజయవంతంగా నిర్వహించారు. ఉదయం నుంచే కడ్తాల్ మండలంలోని అన్ని వర్గాల ప్రజలు,బీసీ సంఘాల నాయకులు,ప్రజాప్రతినిధులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,యువత,పెద్ద సంఖ్యలో రోడ్లపై వచ్చి బీసీల హక్కుల సాధన కోసం నినాదాలు చేస్తూ బంద్ ను విజయవంతం చేశారు.వ్యాపార సంస్థలు,విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, హోటళ్లు, చికెన్ సెంటర్లు,వైన్స్ షాపులు స్వచ్ఛందంగా మూసివేయడం ద్వారా అన్ని వర్గాల వారు తమ మద్దతును తెలియజేశారు.ముందుగా కడ్తాల్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన బీసీ నాయకులు మరియు ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ,అన్ని సబ్బండ వర్గాల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ర్యాలీ నిర్వహించడం జరిగింది. పట్టణ ప్రధాన రహదారులపై ర్యాలీ నిర్వహించిన అనంతరం బస్టాండ్ వద్ద గల మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి,జాతీయ రహదారిపై బైఠాయించి రస్తారోకో నిర్వహించడం జరిగింది.ఈ బంద్ కార్యక్రమానికి మద్దతుగా జాతీయ బిసి కమిషన్ మాజీ సభ్యులు,బీజేపీ రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి,కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ బీసీలు రాష్ట్రంలో జనాభాలో అత్యధిక వర్గం అయినప్పటికీ,రాజకీయ,ఆర్థిక,విద్యా రంగాల్లో ఇప్పటికీ వెనుకబడి ఉన్నారనీ,బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వడం కేవలం ఒక హక్కు మాత్రమే కాదనీ,సామాజిక న్యాయానికి ప్రతీక అనీ,ప్రభుత్వం వెంటనే రిజర్వేషన్ల అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు.బీసీల అభివృద్ధి లేకుండా తెలంగాణ అభివృద్ధి అసంపూర్ణంమని పేర్కొన్నారు.రాష్ట్ర బంద్ బీసీ వర్గాల ఐక్యతకు చిహ్నంగా నిలిచిందనీ బీసీలు రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్నప్పటికీ,రాజకీయ,విద్యా,ఉద్యోగ రంగాల్లో ఇంకా వెనుకబడిపోయారనీ,ఈ నేపథ్యంలో 42% రిజర్వేషన్ అమలు బీసీల ఆత్మగౌరవానికి,భవిష్యత్ తరాల అభివృద్ధికి మార్గం చూపుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే న్యాయపరమైన చర్యలు తీసుకుని రిజర్వేషన్లు అమలు చేయాలి అని గట్టిగా డిమాండ్ చేశారు.

**9వ షెడ్యూల్ లో చేర్చి ఆమోదించాలి**

బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ మరియు కడ్తాల్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిప్పల్ల వెంకటేష్ లు మరియు బీసీ నాయకులు మాట్లాడుతూ గవర్నర్ చేతిలో ఉన్న బీసీ బిల్లును వెంటనే ఆమోదించి,పార్లమెంట్లో ప్రవేశపెట్టి చట్టబద్ధతతో కూడిన తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని బీజేపీ నాయకులను మరియు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీసీల హక్కుల కోసం చివరి వరకు పోరాడుతామనీ,రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తూ బీసీల హక్కులు సాధించే వరకు మా పోరాటం ఆగదనీ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కడ్తాల్ మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్,మాజీ సర్పంచులు లక్ష్మీ నర్సింహారెడ్డి,లాల్కోట నర్సింహా గౌడ్,మాజీ ఎంపీటీసీలు బొప్పిడి గోపాల్,శ్రీనివాస్ రెడ్డి,గురిగళ్ల లక్ష్మయ్య,మాజీ ఉప సర్పంచులు కడారి రామకృష్ణ,వినోద్,వెంకటేష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యా నాయక్,బీజేపీ మండలాధ్యక్షుడు దోనాదుల మహేష్,ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు అబ్బు రమేష్,సీఐటీయూ కన్వీనర్ పెంటయ్య,బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి మూడ రవి,వివేకానంద యూత్ అధ్యక్షుడు మాదవులు మరియు నాయకులు సత్యం యాదవ్,జహంగీర్ అలీ,మాలే మల్లేష్ గౌడ్,హెచ్‌ఆర్.మహేష్,సుధాకర్ గౌడ్,లాయక్ అలీ,వరికుప్పల రాజు,నాగరాజు,శ్రీశైలం గౌడ్,భూపాల్,గణేష్ గౌడ్,భిక్షపతి,మంగలపల్లి నర్సింహా,సిద్దిగారి దాసు,రాయికంటి సురేష్,శ్రీకాంత్,గూదే రాములు యాదవ్,భానుకిరణ్,మూడ అశోక్ మరియు వివిధ గ్రామాల నుంచి వచ్చిన బీసీ నాయకులు,యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ విధానం

## -బీజేపీ ఆరోపణ



**జగిత్యాల, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీలకు 42% రిజర్వేషన్లు అనే అంశాన్ని కాంగ్రెస్ పార్టీ కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకుంటోంది అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరండ్ల మధుకర్ విమర్శించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత 20 నెలలు మౌనంగా ఉండి, చివరి మూడు నెలలుగా హడావిడి చేయడం హాస్యాస్పదమని అన్నారు.బీసీ సమాజం చేపట్టిన బంద్‌కు మద్దతు ప్రకటించడం కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధికి నిదర్శనం కాదని, హామీలను నిలబెట్టుకోలేక వెనక్కి తగ్గిందని విమర్శించారు. కోర్టు స్టే వస్తుందని తెలిసినా, జీవో జారీ చేసి, లక్షల్లో ఫీజులు తీసుకునే లాయర్లను నియమించడం విచిత్రమని పేర్కొన్నారు.బీజేపీ ఎల్లప్పుడూ బీసీల పక్షాన నిలుస్తుందని, ప్రధానమంత్రిగా బీసీ నాయకుడిని నియమించి, కేంద్ర మంత్రివర్గంలో 27 మంది బీసీలకు స్థానం కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. బీసీ కార్పొరేషన్‌కు చట్టబద్ధ హోదా కల్పించిన ఘనత కూడా తమదేనని తెలిపారు.

# ఈ నెల 21న ఉమ్మడి కరీంనగర్ జిల్లా చదరంగ పోటీలు



**ఎలిగేడు, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని రిక్రియేషన్ క్లబ్‌లో ఈనెల 21న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలబాలికల చదరంగ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ కనుకుంట్ల లక్ష్మణ్ తెలిపారు. ఎంపికైన నాలుగు జిల్లాల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

# మూడేళ్ల బాలుడి ముక్కులో ఇరుక్కున్న రాయిని విజయవంతంగా తొలగించిన వైద్యులు








**నాగర్‌కర్నూలు, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నాగర్‌కర్నూలు జిల్లా తాడూరు మండలం ఐతోలు గ్రామానికి చెందిన మూడేళ్ల మోహన్ ఆడుకుంటూ తన ముక్కులో 2.5 సెం.మీ. పరిమాణంలోని రాయిని ఇరికించుకున్నాడు. తీవ్రమైన నొప్పితో బాధపడుతున్న మోహన్‌ను అక్టోబరు 17 రాత్రి 11 గంటలకు మినీ టాంక్ బండ్ రోడ్డులోని వెంకటరమణ చిన్నపిల్లల ఆసుపత్రికి తరలించారు.అక్కడి వైద్య బృందం ఫోర్సెప్ సహాయంతో రాయిని సురక్షితంగా బయటకు తీసింది. చికిత్స అనంతరం బాలుడు పూర్తిగా కోలుకున్నాడు. వైద్యుల సమయస్ఫూర్తి, నైపుణ్యానికి మోహన్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీ బంద్‌కు బిఆర్ఎస్ మద్దతు



**వెల్దండ, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ బంద్‌ను విజయవంతంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా బంద్‌కు మద్దతు తెలిపి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉస్మానియా నుండి డాక్టరేట్ పొందిన రవి నాయక్‌ను సత్కరించిన మర్రి జనార్దన్ రెడ్డి



**నాగర్‌కర్నూల్ జిల్లా**
నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని సల్కర్‌పేట గ్రామ పంచాయతీ పరిధిలోని చంద్రమ్మ తండాకు చెందిన దేగావత్ రవికుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు భూమికి గౌరవం తీసుకురావడంలో ఇది ఓ మైలురాయి. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ మాజీ శాసనసభ్యుడు మర్రి జనార్దన్ రెడ్డి రవికుమార్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన కుటుంబంలో జన్మించి, కష్టపడి చదివి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందడం జిల్లాకు, ముఖ్యంగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి గర్వకారణమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీలో నిబద్ధతతో పనిచేస్తూ, సల్కర్‌పేట గ్రామ ఉప సర్పంచ్‌గా ప్రజాసేవలో నిమగ్నమై, ఇటీవల గ్రూప్ -3 ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఎంతో సంతోషకరమని అన్నారు. రవికుమార్ జీవితంలో ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తన తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## బీజేపీ ద్వంద్వ వైఖరి విడ్డూరం

### ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి అక్టోబర్ 18( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కేంద్రంలో బీజేపీ పార్టీ ఒక విధంగా, రాష్ట్రంలో మరో విధంగా వ్యవహరించడం తగదని ఎమ్మెల్యే మేఘారెడ్డి విమర్శించారు. రాష్ట్ర బీజేపీ నాయకులు బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు మద్దతు తెలుపుతుండగా, కేంద్ర బీజేపీ అదే రిజర్వేషన్‌ను అడ్డుకోవడం డబుల్ ఇంజిన్ ప్రభుత్వపు ద్వంద్వ వైఖరికి నిదర్శనమని తెలిపారు. బీసీ సంఘాలు పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపిందని, వనపర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్ ఆధ్వర్యంలో బంద్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని ముఖ్య రహదారుల మీదుగా కొనసాగి రాజీవ్ చౌరస్తాలో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న నిర్ణయం రాహుల్ గాంధీ పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టే దిశగా సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న సాహసోపేత చర్య అని చెప్పారు. బీసీ సర్వే ఆధారంగా 56 శాతం జనాభా ఉన్న బీసీలకు న్యాయం చేయడానికి బిల్లును ఆమోదించి గవర్నర్, రాష్ట్రపతికి పంపినా వారు ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. బీసీగా ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నరేంద్ర మోడీ, బీసీ రిజర్వేషన్లపై మౌనం వహించడం విచిత్రమని ఆయన అన్నారు. 42 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించకపోతే ప్రజల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎలిగేడులో బీసీ బంద్‌కు విశేష స్పందన



**ఎలిగేడు, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శనివారం ఎలిగేడు మండలంలో బంద్ నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బింగి రాజు, యువత మండల అధ్యక్షుడు మొలుగూరి పరశురాములు గౌడ్ ఆధ్వర్యంలో బంద్‌కు ఏర్పాట్లు జరిగాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో పాటు వివిధ కుల సంఘాలు పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు. తెరాస మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీలు తానిపర్తి స్రవంతి, మోహనరావు, కవ్వంపల్లి లక్ష్మి, దుర్గయ్య, బీజేపీ ప్రధాన కార్యదర్శి అడ్డగుంట తిరుపతి, అమరగుండ గంగయ్య, కప్పల ప్రవీణ్, న్యాతరిపోచాలు, బాసంపల్లి వినోద్, శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్, మారం సుధీర్ కుమార్, సురేష్, తిరుపతి చౌదరి, మల్లారపు అంజయ్య తదితరులు పాల్గొన్నారు. బీసీ యువ నాయకులు అడ్డగుంట ప్రదీప్ గౌడ్, వేగోళపు నాగరాజు, మల్లారపు అంజయ్య బంద్‌ను సమర్థవంతంగా నిర్వహించారు.

# వనపర్తికి వన్నె తెచ్చిన కళాకారులకు సాహితీ కళావేదిక సన్మానం

### కళలకు పుట్టినిల్లు వనపర్తి
### అధ్యక్షులు శంకర్ గౌడ్



**వనపర్తి అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వనపర్తి జిల్లాకు కళ, సాహితీ, సాంస్కృతిక రంగాల్లో వన్నె తెచ్చిన ప్రతిభావంతులైన కళాకారులు ఎంతోమంది ఉన్నారని, వనపర్తి ప్రాంతము కళ లకు పుట్టినిల్లు అని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. వనపర్తి పట్టణంలో సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఇటీవల రూపొందించిన "కావ్య మాలిని" లఘు చిత్ర కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ,"వనపర్తి కళాకారులకు కొలువులేకపోయినా ప్రతిభ మాత్రం అపారంగా ఉంది. సినిమా, సాహిత్యం, చిత్రలేఖనం వంటి అన్ని రంగాల్లో వనపర్తి ప్రతిభ ఇప్పుడు దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో వెలుగొందుతోంది" అని పేర్కొన్నారు. వివిధ సామాజిక అంశాలతో లఘు చిత్రాలు రూపొందిస్తూ సోషల్ మీడియాలో విశేష గుర్తింపును తెచ్చుకుంటున్న వనపర్తి యువతను ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. "కావ్య మాలిని" లఘు చిత్రం ప్రేక్షకుల ప్రశంసలు అందుకోవడం వనపర్తి కళాకారుల ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. కళాకారులను గుర్తించి ప్రజలకు పరిచయం చేస్తూ వేదికగా నిలుస్తున్న సాహితీ కళావేదిక విశాల హృదయానికి పలువురు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా లఘు చిత్ర నటీనటులు చెన్న పద్మ, శంకరయ్య, కళ్యాణి, విజయ్, దర్శకుడు శ్రీమద్ బాలు, నిర్మాత లక్ష్మణ్ నాయుడు, సంజు తదితరులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో కందూరు నారాయణ రెడ్డి, బైరోజు చంద్రశేఖర్, గంగవరం రామకృష్ణారెడ్డి, చెన్న సత్యనారాయణ, ఎం.ఎ. సత్తార్, దేశీ రాములు యాదవ్, డా. కంటే నిరంజనయ్య, బండారు శ్రీనివాస్, ఉప్పరి తిరుమలేశ్,రుకునందం అనంతప్ప,రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉంది

### ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.



**దేవరకొండ అక్టోబర్ 18. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు నేడు దేవరకొండ పట్టణంలో నిర్వహించిన "బీసీ బంద్" కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం అన్ని విధాలుగా పోరాడుతామని,రాజకీయాలు ఎన్నికల వరకే రిజర్వేషన్ల విషయంలో అందరం ఏకం కావాల్సిన అవశ్యకత ఉందని అన్నారు. రాహుల్ గాంధీ ఆశయ సాధన కోసం సీఎం రేవంత్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారు. బీసీ బంద్ తో బీజేపీ కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని,భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన జరగాలనే అంశాన్ని స్పష్టంగా ప్రస్తావించడం జరిగిందని , ఆ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేపట్టింది అని అన్నారు. స్థానిక సంస్థలలో 42% రిజర్వేషన్ కల్పించేందుకు సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ దాఖలు చేసింది. ఇది బీసీ రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీ యొక్క నిజమైన చిత్తశుద్ధికి నిదర్శనం. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, నియోజక వర్గ ముఖ్య నాయకులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, బీసీ సంఘం,వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం పరిశీలించిన

### కలెక్టర్ హైమావతి




**సిద్ధిపేట, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ హైమావతి శనివారం కలెక్టరేట్ పక్కనగల ఎన్నికల ఈవీఎం గోదాంను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నెలవారీ తనిఖీలలో భాగంగా రక్షణ చర్యలు, లాగ్‌బుక్, విజిటర్స్ రిజిస్టర్‌ను పరిశీలించి సంతకం చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల మేరకు గోదాం చుట్టూ సీసీ కెమెరాల పనితీరు, 24 గంటల పోలీస్ బందోబస్తు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

## బీసీ రిజర్వేషన్లపై కేంద్ర వైఖరికి నిరసన

### షాపూర్‌నగర్‌లో వామపక్షాల ర్యాలీ




**షాపూర్‌నగర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఆటంకంగా ఉన్న రాష్ట్ర గవర్నర్, కేంద్ర బీజేపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా వామపక్షాల ఆధ్వర్యంలో రాష్ట్ర బంద్‌కు పిలుపు ఇచ్చారు. కుత్బుల్లాపూర్ మండల కమిటీల ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ రైతుబజార్ నుంచి గాజులరామారం చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీపీఎం, సీపీఐ, మాస్ లైన్ నేతలు పి సత్యం, ఉమామహేష్, ప్రవీణ్, కీలుకాని లక్ష్మణ్, స్వామి పాల్గొన్నారు. బీసీ బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీలో అన్ని పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదం లభించినా, కేంద్ర ప్రభుత్వం ఆమోదించకపోవడం బాధాకరమని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లకు ప్రధాన అవరోధం కేంద్ర బీజేపీ ప్రభుత్వమేనని, అమలుకు పూర్తి బాధ్యత కేంద్రానిదేనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు అంజయ్య, బోనాల కనకయ్య, దేవదానం, చంద్రకాంత్, కరుణాకర్, కే శీను, మల్లయ్య, నాగరాజు, ఆంజనేయులు, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు



**అల్విన్ కాలనీ,అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో నాయి బ్రాహ్మణ సోదరుల ఆధ్వర్యంలో శ్రీ ధన్వంతరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ హాజరై ధన్వంతరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధన్వంతరి మొదటి ఆయుర్వేద వైద్యుడిగా వ్యాధుల నివారణకు అపార కృషి చేశారని, ఆయుర్వేద రంగంలో ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పోశెట్టిగౌడ్, శ్రీనివాస్, యాదగిరి, సతీష్, స్వామి, పోచయ్య, రాజ్ కుమార్, మల్లేష్, కృష్ణ, నాగేష్, శ్యామ్, భాస్కర్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కేంద్ర వైఖరికి నిరసన

## కరీంనగర్‌లో ఫార్వర్డ్ బ్లాక్ బైక్ ర్యాలీ



**కరీంనగర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ, ఆల్ ఇండియా యూత్ లీగ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బండారి శేఖర్, రావుల ఆదిత్య నేతృత్వంలో కామన్ నుంచి ఆర్ & బి చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. బైపాస్ ప్రాంతంలోని షోరూంలు, వైన్స్ వద్ద బంద్ నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ బీసీ బిల్లును పార్లమెంటులో ఆమోదించేందుకు బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ఒత్తిడి చేయాలని, లేదంటే రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొనాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లు ఆమోదింప చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ అమలయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోహెడ వేణు, సాయి, అనురాగ్, సాయిరాం, మహేష్, సాయికిరణ్ రెడ్డి, పవన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో బీసీ రిజర్వేషన్ల కోసం బంద్‌కు విశేష స్పందన



**హుస్నాబాద్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు పిలుపు మేరకు హుస్నాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులు, దుకాణదారులు బంద్‌కు మద్దతు తెలిపారుపార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు బంద్‌లో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. బంద్ విజయవంతంగా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# ఎంపీ చామలకి స్వాగతం పలికిన పీసీసీ నేత అంజన్ కుమార్



**కరీంనగర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా డీసీసీ అధ్యక్షుల నియామకల పరిశీలన కోసం ఈరోజు పట్టణానికి విచ్చేసిన భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డిని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ మర్యాదపూర్వకంగా స్వాగతించి శాలువాతో సత్కరించారు.

# పోయిన ఫోన్లు తిరిగి అప్పగించిన పోలీస్ బృందం



**కరీంనగర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు పోయిన స్మార్ట్‌ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో గుర్తించి రికవరీ చేశారు. కోల మనిదీప తన రెడ్మీ ఫోన్‌ను చెలిమడ ఆనందరావు ఆసుపత్రిలో, శంకరయ్య తన రియల్‌మీ ఫోన్‌ను తీగలగుట్టపల్లిలో పోగొట్టుకున్నారు.శనివారం నాడు రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి ఈ ఫోన్లను యజమానులైన మనిదీప, శంకరయ్యకు అప్పగించారు. రికవరీలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

# బీసీలకు 42% రిజర్వేషన్ల సాధనే లక్ష్యం

## కమాన్‌పూర్‌లో బంద్ విజయవంతం



**కమాన్‌పూర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ పిలుపు మేరకు కమాన్‌పూర్ మండలంలో బంద్ నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీఆర్ఎస్, బీజేపీ మండల పార్టీల సహకారంతో బంద్‌కు విశేష స్పందన లభించింది.పెద్దపల్లి మంథని ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించగా, జై బీసీ నినాదాలతో ప్రాంతం మార్మోగింది. మండలంలోని జూలపల్లి, గుండారం, సిద్ధిపల్లెల్లో బైక్ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూబీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చినా, అమలులో నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకోవడం కాంగ్రెస్ వ్యూహమని, ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రిజర్వేషన్ సాధన వరకు పోరాటం ఆగదని, తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీ హక్కులకు అడ్డు తగిలే వారిని సహించబోమని, తగిన పరిణామాలు ఎదురవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో నల్లవెల్లి శంకర్, తోట రాజ్ కుమార్, తాటికొండ శంకర్, సతీష్ యాదవ్, మచ్చగిరి రాము, మల్యాల రామచంద్రన్, తిరుపతి, మేకల సంపత్, ఉప్పరి శ్రీనివాస్, జంగపల్లి అజయ్, గుర్రం లక్ష్మీమల్లు, బొమ్మగాని అనిల్, మల్లారపు అరుణ్, ఆకుల గట్టయ్య, పోలు సాయికుమార్, జాబు సతీష్, రాచకొండ రవి, పల్లె నారాయణ, బోయిని బాలకృష్ణ, ఎలబోయిన రామ్మూర్తి, నడిగట్టు సంపత్, పొట్ల సతీష్, మానుక ఓదెలు, మిట్ట సందీప్, బర్ల సదయ్య, కొమ్ము శ్రీనివాస్, మోరే ప్రశాంత్, శ్యాంసుందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

## కలెక్టర్ పమేలా




**కరీంనగర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ పనితీరు మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి జిల్లా వైద్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి, ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇమ్యునైజేషన్ పూర్తి కాకపోవడం, ప్రసవాల సంఖ్య తగ్గడం వంటి అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గర్భిణీలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, సాధారణ ప్రసవం కోసం కౌన్సెలింగ్ చేయాలని, రిజిస్ట్రేషన్లు, వైద్య పరీక్షలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పీహెచ్‌సీలో నోటీసు బోర్డు ఏర్పాటు చేసి, ప్రసవాలు, వైద్యం పొందిన రోగుల వివరాలు ప్రదర్శించాలని ఆదేశించారు. ఆరేళ్ల లోపు చిన్నారులకు దగ్గు మందులు రాయవద్దని, నిక్షయ్ పోర్టల్‌లో టీవీ కేసులు నమోదు చేస్తే ప్రభుత్వ సాయం అందుతుందని తెలిపారు. మాతామరణాలపై సమీక్ష సందర్భంగా డాక్టర్లు ఎంసీపీ కార్డుపై, కేసు షీట్‌పై తప్పనిసరిగా సంతకాలు చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో డిఎంహెచ్వో వెంకటరమణ, పీఓ సనా, పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఐఎంఏ సభ్యులు పాల్గొన్నారు.

# అమ్రాబాద్‌లో బీసీ బంద్‌కు విశేష స్పందన



**అమ్రాబాద్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ బీసీ జేఏసీ పిలుపు మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు మద్దతుగా అమ్రాబాద్ మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో రాస్తారోకో నిర్వహించారు. బీసీ సంఘం నాయకులు, వివిధ రాజకీయ, కుల సంఘాల ప్రతినిధులు, వ్యాపార వర్గాలు బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో బాల్ లింగం గౌడ్, హరి నారాయణ, మల్లికార్జున్, సురేష్, గోలి మల్లేష్, ఎలిజాల శీను, లక్ష్మణ చారి, ఆర్. వెంకటయ్య, బాల్ సాయిలు, సురేష్, లడ్డు యాదవ్, బీసీ ఐక్యవేదిక మండల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీసీల పట్ల బీజేపీ - బీఆర్ఎస్ కపట ప్రేమ

## రాజ్ ఠాకూర్



**గోదావరిఖని, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ బీసీ బంద్ సందర్భంగా రామగుండం నియోజకవర్గ శాసనసభ్యుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గోదావరిఖని చౌరస్తా వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ మాట్లాడుతూబీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు పెరగాలన్న లక్ష్యంతో కుల గణన చేపట్టిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. 42 శాతం రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ జారీ చేసి గవర్నర్‌కు పంపినా, కేంద్రం నుంచి స్పందన రాలేదని తెలిపారు.జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో ధర్నా చేసినప్పటికీ కేంద్రం స్పందించకపోవడం బాధాకరమని, బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేంద్రానికి ఆసక్తి లేదని విమర్శించారు. రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది ఎంపీల్లో ఇద్దరు కేంద్ర మంత్రులుండి కూడా గవర్నర్‌ను ఒప్పించలేకపోవడం దురదృష్టకరమన్నారు.గతంలో బీఆర్ఎస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 23 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, ప్రస్తుతం బీజేపీ–బీఆర్ఎస్ పార్టీలు బీసీల పట్ల చూపుతున్న కపట ప్రేమను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ అన్యాయానికి నిరసనగా బీసీ సంఘాలు పిలుపునిచ్చిన బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# శాతవాహన వసతి గృహాల చీఫ్ వార్డెన్‌గా నజీముద్దీన్ మునవర్



**కరీంనగర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయ బాలుర -బాలికల వసతి గృహాల చీఫ్ వార్డెన్‌గా ఉర్దూ విభాగానికి చెందిన డాక్టర్ నజీముద్దీన్ మునవర్‌ను నియమిస్తూ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ ఆదేశాల మేరకు జరిగింది.ప్రస్తుతం స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీగా కొనసాగుతున్న మునవర్, గతంలో ఉర్దూ విభాగాధిపతిగా, ప్రస్తుతం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా సేవలందిస్తున్నారు. ఈ ఏడాది తెలంగాణ ఉర్దూ అకాడమీ నుండి ఉత్తమ ఆచార్య బహుమతి పొందిన ఘనత ఆయనకు దక్కింది. ఈ బాధ్యతలను డాక్టర్ మనోహర్ నుండి స్వీకరించారు.ఈ సందర్భంగా ఉపకులపతి, రిజిస్ట్రార్, ఓఎస్‌డీ డాక్టర్ హరికాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీ రిజర్వేషన్లకు ప్రధాన అవరోధం కేంద్ర బీజేపీ

-సీపీఎం నేత నరసింహ






**యాచారం, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో యాచారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. హైదరాబాద్ నాగార్జునసాగర్ రహదారిపై జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ మాట్లాడుతూబీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసి గవర్నర్‌కు పంపినా, కేంద్రం స్పందించకపోవడం బాధాకరమన్నారు. పార్లమెంటులో చట్టం చేసి తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాల్సిన బాధ్యత కేంద్రానిదేనని, కానీ బంద్‌కు మద్దతు తెలుపుతూ తెలంగాణలో బీజేపీ పాల్గొనడం కపటత్వమని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్ అమలుకు కేంద్రం బాధ్యత వహించాలని, బీసీ ప్రజలు ప్రశ్నించాలన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సీపీఎం పార్టీ రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు పేరుమండ్ల అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పెండ్యాల బ్రహ్మయ్య, జంగయ్య, చందునాయక్, ఫిరాటి వెంకటయ్య, కావలిజగన్, లాజర్, బాల్ రాజు, తావు నాయక్, ఉడతల జంగయ్య, అమీర్‌పేట మల్లేష్, బిర్లా మల్లేష్, వినోద్ కుమార్, శ్రీమణ్ నారాయణ, పుష్ప, రమేష్, సత్యం, శ్రీరాములు, భూషణ్, ఆనంద్, భాస్కర్, శ్రీకాంత్, మూలీ జంగయ్య, సురేష్, సోంటే రాములు, కృష్ణ, బుగ్గ రాములు, మండలి రాములు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌ఐవి నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి




**మంచిర్యాల, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధి నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, హెచ్‌ఐవి నియంత్రణ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని వైద్యాధికారి డా. అనిత, ప్రోగ్రాం అధికారి డా. సుధాకర్ నాయక్‌లతో కలిసి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూవ్యాధిగ్రస్తుల పట్ల వివక్షను తొలగించేందుకు, ప్రజల్లో అపోహలు, అనుమానాలను నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య ఉపకేంద్రం, పీహెచ్‌సీల్లో హెచ్‌ఐవి, ఎస్‌టీఐ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యువత హెచ్‌ఐవి, ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి నియంత్రణలో భాగస్వాములై సమాజంలో మార్పు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ వెంకటేశ్వర్లు, సీహెచ్ఓ నామ్‌దేవ్, వైద్యాధికారులు, ఐసీటీసీ కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# లక్కీ డ్రా ద్వారా గురుకుల సీట్ల భర్తీ



**మంచిర్యాల, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలోని గురుకుల పాఠశాలల ఖాళీ సీట్లను లక్కీ డ్రా పద్ధతిలో భర్తీ చేసినట్టు జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ తెలిపారు. శనివారం నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగురుకుల బాలికల పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు 74 సీట్లు ఖాళీగా ఉండగా, 37 సీట్లను భర్తీ చేశామని, బాలుర గురుకుల పాఠశాలల్లో 89 ఖాళీల్లో 38 సీట్లు భర్తీ చేశామని తెలిపారు. ఇప్పటివరకు మూడు సార్లు పరీక్ష రాత పద్ధతిలో ఎంపిక చేసిన అనంతరం, చివరిగా లక్కీ డ్రా ద్వారా అవకాశం కల్పించామని వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బీసీ రాజ్యాధికారానికి ఉద్యమాలు అవసరం

బండ ఆంజనేయులు



**కందుకూరు, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కందుకూరు మండల కేంద్రంలో బంద్ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బండ ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య నేతృత్వంలో శ్రీశైలం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వివిధ రాజకీయ, కుల సంఘాల నాయకులు, వ్యాపార, విద్యా సంస్థలు బంద్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూతెలంగాణలో 67 శాతం జనాభా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అగ్రకులాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. చట్టవిరుద్ధమైన అడ్డంకులను అధిగమించి, గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమం కొనసాగిస్తామని ప్రకటించారురాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసి గవర్నర్‌కు పంపినా, కేంద్రం స్పందించకపోవడం, సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించవచ్చని సూచించడం, హైకోర్టు స్టే ఇవ్వడం వంటి పరిణామాలపై బీసీ సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. రాజ్యాంగ సవరణ ద్వారానే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ బంద్‌కు 135 బీసీ కుల సంఘాలు, 35 బీసీ సంఘాలు మద్దతు తెలుపగా, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాయి. వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించడంతో కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో చిలకమర్రి నరసింహ, కాకి దశరథ, అచ్చన్న పాండు, ఎడ్ల బాబురావు, మన్నే జయేందర్, రామ్ చందర్ శ్రీనివాస్, బుట్టి బాలరాజ్, నిమ్మ అంజిరెడ్డి, గౌర ప్రభాకర్, సరికొండ మల్లేష్, పాండు, జగన్, అమరేందర్, ఆంజనేయులు, వెంకటేష్ గౌడ్, రవి జంగయ్య, రవి గౌడ్, మల్లేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టీఐ చట్టంపై అవగాహన కల్పించాలి

-అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్





**సిద్దిపేట, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సమాచార హక్కు చట్టం -2005 (ఆర్‌టీఐ అక్ట్)పై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అన్ని శాఖల పీఐఓ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూఆర్‌టీఐ చట్టం ద్వారా పౌరులు ప్రభుత్వ కార్యాలయాల నుండి సమాచారాన్ని పొందే హక్కును వినియోగించుకోవచ్చని, ఇది ప్రజాస్వామ్య బలోపేతానికి, అవినీతి నివారణకు దోహదపడుతుందని తెలిపారు. శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత సెక్షన్ ద్వారా సమాధానాలు ఇవ్వాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్లను త్వరితగతిన పరిష్కరించి, అడిగిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు. పీఐఓలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసే దిశగా మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రెహమాన్, ఎంసిఎచ్ఆర్‌డీ రీజనల్ ట్రైనింగ్ మేనేజర్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# కొమురవెల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**కొమురవెల్లి, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గరీమ అగ్రవాల్ శనివారం అకస్మాత్తుగా కొమురవెల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. హాజరు, ఓపీ రిజిస్టర్లు, మందుల ధృవీకరణ పత్రాలు పరిశీలించి, రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి వైద్య సిబ్బందితో సమావేశమై, డెంగ్యూ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, మందులను సద్వినియోగం చేసుకొని పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు.

# అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న శ్రీరాములు



**బాలాపూర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కర్మన్ ఘాట్ హరిహర క్షేత్రంలో అయ్యప్ప స్వామి పదునెట్టాంబడి మహా పడిపూజను బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ సీనియర్ నాయకుడు చిత్రం శ్రీనివాస్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరై అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రం శ్రీనివాస్, శ్రీరాములను ఘనంగా సత్కరించి ఆశీర్వదించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూఅయ్యప్ప దీక్ష భక్తి మార్గంలో వ్యక్తి జీవన విధానాన్ని మారుస్తుందని, దీక్ష అనంతరం కూడా హిందూ ధర్మ రక్షణకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణా రెడ్డి, తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, గురుస్వామి పాలుబాయ్ లక్ష్మణ్, బీజేపీ సీనియర్ నాయకులు కుంటి భాస్కర్, అంకంగారి శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బంద్ విజయవంతం-కిచ్చెన్న

ఢిల్లీకి వెన్నులో వణుకు పుట్టించాలి-కేఎల్ఆర్



**తుక్కుగూడ, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ బీసీ జేఏసీ పిలుపు మేరకు నిర్వహించిన బంద్ కార్యక్రమం తుక్కుగూడలో ఘనంగా జరిగింది. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) మాట్లాడుతూబీసీ సంఘాల ధర్నాలు, ర్యాలీలు, నిరసనలు విజయవంతమయ్యాయని తెలిపారు. తుక్కుగూడ చౌరస్తాలో చాకలి ఐలమ్మ సహా మహానీయుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే, కేంద్ర బీజేపీ నాయకత్వం కుట్రలు చేస్తూ అడ్డుకుంటుందని ఆరోపించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల పాత్ర అపూర్వమైందని, అదే తీరులో బీసీ రిజర్వేషన్ల సాధనకు ప్రజలు ఏకతాటిపై రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బీజేపీ నాయకత్వం ఇక్కడ ఓ మాట, ఢిల్లీలో మరో మాట మాట్లాడుతూ బీసీలపై కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. అంబేద్కర్, జ్యోతిరావు పూలే, చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో రాజ్యాంగబద్ధంగా బీసీలకు రాజ్యాధికారం కల్పిస్తామని కేఎల్ఆర్ తెలిపారుఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు, బీసీ సంఘాలు,మహిళా నాయకురాళ్లు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంటి పన్నులు వసూలు చేయండి

## డీఎల్పీఓ వేణుగోపాల్



**ఎలిగేడు, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండలంలోని గ్రామపంచాయతీల్లో పేరుకుపోయిన ఇంటి పన్నులను వెంటనే వసూలు చేయాలని జిల్లా స్థానిక సంస్థల అధికారి (డీఎల్పీఓ) వేణుగోపాల్ సూచించారు. శనివారం ఎంపీఓ కిరణ్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపౌర సేవలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, సిబ్బందికి సంబంధించిన వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి కార్యదర్శి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గురుకుల సీట్లకు కౌన్సిలింగ్ ద్వారా అడ్మిషన్లు



**చేర్యాల, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న బాలుర, బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లకు కౌన్సిలింగ్ ద్వారా అడ్మిషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమం చేర్యాలలోని గురుకుల పాఠశాల ప్రాంగణంలో ఘనంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా దాదాపు 800 పైచిలుకు విద్యార్థులు పాల్గొని సీట్లు పొందారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగ్రవాల్, జోనల్ అధికారి ప్రత్యూష, జిల్లా సమన్వయ అధికారి పోలోజు నరసింహ చారి, పాఠశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు. అడ్మిషన్లకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

## -విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వేములవాడ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న రోడ్లు, ఇంకా ప్రారంభించని పనులు, సిఆర్ఆర్, ఎంఆర్ఆర్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఈఈలు సుదర్శన్ రెడ్డి, లక్ష్మణ్ రావు, డిఈలు పనవన కుమారి, సత్యనారాయణ, విష్ణు వర్ధన్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

**కరీంనగర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చెల్లని చెక్ ఇచ్చిన కేసులో నిందితురాలైన పోతుగంటి సుజాతపై నేరం రుజువు కావడంతో కరీంనగర్ స్పెషల్ (పిసిఆర్) కోర్టు న్యాయమూర్తి చిరాగ్ మెహతా శుక్రవారం ఏడాది జైలు శిక్షతో పాటు 3.05 లక్షల ఫైన్ విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఫిర్యాదుదారుడు భోస్లే మహేశ్ తన మారుతి స్విఫ్ట్ కారును సుజాతకు విక్రయించగా, 2 లక్షల అడ్వాన్స్ చెక్ ఇచ్చింది. బ్యాంకులో చెక్ బౌన్స్ కావడంతో లీగల్ నోటీసులు పంపినా స్పందన లేకపోవడంతో కోర్టులో కేసు దాఖలయ్యింది. సాక్ష్యాధారాల పరిశీలన అనంతరం న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

# బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలి-సిపిఐ



**గోదావరిఖని, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ బీసీ జేఏసీ పిలుపు మేరకు రాష్ట్ర బంద్ సందర్భంగా గోదావరిఖని ఖని చౌరస్తా వద్ద సిపిఐ నగర సమితి శ్రేణులు కేంద్ర ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును తక్షణమే పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు మాట్లాడుతూతెలంగాణ అసెంబ్లీలో అన్ని పార్టీల మద్దతుతో బీసీ రిజర్వేషన్ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపినా, నెలలు గడిచినా కేంద్ర ప్రభుత్వం బిల్లును ఆమోదించకపోవడం బీసీల పట్ల అన్యాయమని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తూ బీసీలకు అన్యాయం చేస్తోందన్నారు. బిల్లును తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చి ఆమోదించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, రాష్ట్రంలో ఉన్న బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు బీసీ బిల్లును అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీసీలకు రాజ్యాధికారం కల్పించేందుకు సిపిఐ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, మాటేటి శంకర్, తొడుపునూరి రమేశ్ కుమార్, ప్రీతం, ఆసాల రమ, తిరుమల, ఆసాల నవీన్, జగన్, గంగారపు చెంద్రయ్య, సిరిసిల్ల మల్లేష్, ఎర్రల రాజయ్య, ఎం.డి. రాజ్ మహ్మద్, గుంపుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్.. ఇబ్రహీంపట్నంలో సంపూర్ణ బంద్

## -ఇబ్రహీంపట్నంలో బందు సక్సెస్

## -రోడ్డెక్కని ఆర్టీసీ బస్సులు- స్వచ్ఛందంగా బంద్ లో ఆర్టీసీ కార్మికులు





**ఇబ్రహీంపట్నం , అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన బీసీ బంద్ విజయవంతం అయింది. కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, విద్య, ఉపాధి, బీసీ సబ్ ప్లాన్ కాంట్రాక్టుల్లో 42 శాతం వాటా హామీ ఇచ్చి అధికారంలోకి రావడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చి 22 నెలలు గడిచిపోతున్నా ఇప్పటివరకు ఏ ఒక్క హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తూ బీసీలను మోసం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోనీ బి,ఆర్,ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు .ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో కదలని ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ డిపో వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి పర్యవేక్షించారు. ఇబ్రహీంపట్నంలో ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులతో మాట్లాడారు. ఇబ్రహీంపట్నం సర్కిల్ పరిధిలో జరిగిన బంద్ వివరాలను ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజును అడిగి తెలుసుకున్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**భూపాలపల్లి, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై హైకోర్టు ఇచ్చిన స్టేను నిరసిస్తూ బీసీ సంఘాల జేఏసీ పిలుపు మేరకు శనివారం తెలంగాణ బంద్ నిర్వహించారు. ఈ బంద్‌కు ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు హాజరై, హనుమాన్ ఆలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఎమ్మెల్యే జీఎస్సార్ మీడియాతో మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం సర్వే నిర్వహించి, శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి, ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపిందన్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గుతారని భావించి, బీజేపీ ప్రభుత్వం గవర్నర్‌ను మధ్యలో అడ్డు పెట్టి ఆర్డినెన్స్‌ను పెండింగ్‌లో ఉంచిందని విమర్శించారు. ఇది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. కోర్టులపై గౌరవం, నమ్మకం ఉన్నప్పటికీ, బీసీ సంఘాలు ఏకమై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్, సుంకరి రామచంద్రయ్య, పీసీసీ సభ్యులు చల్లూరి మధు, వివిధ బీసీ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# నల్లగొండలో బంద్ ప్రశాంతం

## -భారీగా ర్యాలీలు తీసిన వివిధ పార్టీలు

## -తెల్లవారుజాము నుండి బస్టాండ్ లో బస్సులు బయటికి రాకుండా నిలిపివేసిన వివిధ పార్టీలు





**నల్లగొండ ,అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్గొండలో నేడు జరుగుతున్న బీసీల బంద్ కు మద్దతుగా వివిధ పార్టీల నాయకులు బంద్ నిర్వహించారు తెల్లవారుజాము నుండి బస్టాండ్ ముందు కూర్చొని బస్సులు బయటికి రాకుండా అడ్డుకున్నారు అనంతరం కొంతమంది స్వచ్ఛందంగా బందు నిర్వహించగా మరికొన్ని దుకాణాలను బీసీ సంఘం నాయకులు మూసి వేయించారు రోడ్లన్నీ నిర్మానుషంగా కనిపించాయి కాంగ్రెస్ భారీ ర్యాలీ నిర్వహించింది. మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి క్లాక్టవర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి సహా పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీసీలకు వెంటనే న్యాయం చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.

# బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలని బంద్‌లో పాల్గొన్న ధర్మ సమాజ్ పార్టీ




**నల్లగొండ, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా బీసీ జేఏసీ పిలుపు మేరకు శనివారం బంద్ నిర్వహించారు. ఈ బంద్‌కు నైతిక మద్దతు ప్రకటించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ పిలుపు మేరకు నల్లగొండ జిల్లా ధర్మ సమాజ్ పార్టీ శ్రేణులు బీసీ సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నకరికంటి కళ్యాణ్ గౌడ్ మాట్లాడుతూ బీసీల గుండె ఘోషను ప్రతిబింబించేలా ఈ నిరసనలో భాగస్వామ్యం కావడం జరిగింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పార్లమెంటులో చేర్చి శాశ్వత పరిష్కారం కల్పించాలని, లేకపోతే ఈ పోరాటంలో ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వబోమని, ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు తలారీ రాంబాబు, నాయకులు శంకర్, లింగయ్య, వినోద్, కనగల్ మండల అధ్యక్షుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా బంద్‌లో పాల్గొన్న కనగల్ మండల కాంగ్రెస్ నాయకులు



**కనగల్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా బీసీ జేఏసీ పిలుపు మేరకు శనివారం బంద్ నిర్వహించారు. కనగల్ మండల కేంద్రంలో ఈ బంద్‌కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూదేశంలో మార్పు కోసం AICC అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన నినాదాన్ని అనుసరిస్తూ, తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి, ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్‌కు పంపినప్పటికీ, బీజేపీ ప్రభుత్వం మొదటి నుంచీ బీసీలకు మోకాలడ్డుతోందని విమర్శించారు. న్యాయస్థానాల్లో బీసీ రిజర్వేషన్లకు ఎదురైన అడ్డంకులు బాధాకరమని పేర్కొన్నారు. అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ ప్రకటించిందని, సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి న్యాయం చేయడానికి కృషి చేశారని తెలిపారు. నల్గొండ నియోజకవర్గంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు అయ్యేలా కృషి జరుగుతోందని పేర్కొన్నారు. బీసీల పట్ల బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బంద్‌కు సహకరించిన విద్యా, వ్యాపార సంస్థలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# కల్వకుర్తి లో బీసీ బంద్ ప్రశాంతం






**బీసీలకు 42% రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాటం ఆగదు -బీసీ జేఏసీ**

**కల్వకుర్తి, అక్టోబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం తెలంగాణ జేఏసీ పిలుపు మేరకు కల్వకుర్తి పట్టణంలో తెలంగాణ బంద్ సంపూర్ణంగా జరిగింది. జేఏసీ నాయకులు బస్ డిపో ముందు బస్సులు బయటకు వెళ్లకుండా బయట నుంచి నిరసన తెలుపుతూ అక్కడే నిరసన శిబిరాన్ని ఏర్పాటు చేశారు . బంద్ లో బీసీ జేఏసీ నాయకులు, బీసీ నేతలు ,బీసీ కుల సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు బయట నుంచి నిరసన తెలుపుతూ వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు రావాల్సిన 42 శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేవరకు పోరాటం ఆగదు అని అన్నారు. పట్టణంలో స్వచ్ఛందంగా కిరాణా షాప్ లు, సినిమా థియేటర్లు ,పెట్రోల్ పంపులు చిరు వ్యాపారులు ,పలు వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ చేశాయి. అదేవిధంగా ప్రధాన రహదారి గుండా బీసీ నాయకులు ప్రధాన కూడలిలో నినాదాలు పలుకుతూ నడుస్తూ నిరసన తెలిపారు. శిబిరం వద్ద కల్వకుర్తి శాసనసభ్యులు శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ల 42 శాతం ఆమోదం తెలిపి స్థానిక ఎన్నికలకు ముందుకు వచ్చింది . బీసీల రిజర్వేషన్ల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ దృఢ సంకల్పంతో ఉంది అని అన్నారు.

మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ .. తెలంగాణలో ఎస్సీ ఎస్టీ బీసీ అన్ని కులాలకు న్యాయం జరగాల్సిన అవసరం ఉంది ప్రభుత్వంపై బాధ్యత ఉంది అని అన్నారు ఏ రాష్ట్రం కూడ చేయని చట్ట ప్రకారం కమిషన్ వేసి 84 వేలమంది అధికారులు చేత కులగణన నిర్వహించి కమిషన్ రిపోర్ట్ ఆధారంగా శాసనసభలో పెట్టి ఆర్డ్ నెన్ రూపొందించి గవర్నర్ నుండి రాష్ట్రపతి వరకు వెళ్లింది రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉంది అని పేర్కొన్నారు . బీసీలకు రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రమే కాకుండా రాజకీయ విద్య ఉద్యోగాలలో 42 శాతం అమలు కావాలని చట్టం చేయడం జరిగింది అని అన్నారు గడచిన 75 సంవత్సరాలలో 120 పర్యాలు రాజ్యాంగ సవరణ చేయగా ప్రజాస్వామ్యంలో మరోసారి బీసీల కొరకు రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. దామాషా ప్రకారం బీసీల రిజర్వేషన్లకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు బిసి నాయకులు మాట్లాడుతూ ... తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42% రాజకీయ విద్య ఉద్యోగాలలో రిజర్వేషన్లు అమలు అయ్యే వరకు బీసీల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ సభ్యులు గుర్కా జైపాల్ యాదవ్ , పొల్యూషన్ కంట్రోల్ మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ యాదవ్ , మాజీ చైర్మన్ ఎద్మ సత్యం,మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, జేఏసి నాయకులు మేకల రాజేందర్, సదానందం గౌడ్, పాయిల్ల గోపాల్, జేఏసీ నాయకులు, కుల సంఘాలు, పలు పార్టీల నాయకులు వివిధ సంఘాల నాయకులు పలువురు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



**కద్దాల్, అక్టోబర్ 18 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** కద్దాల్ మండలం మక్త మాదారం గ్రామంలో ఇటీవల నింగారి కాశయ్య అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామ బీఆర్ఎస్ పార్టీ తరపున గ్రామ మాజీ సర్పంచ్ సులోచన సాయిలుతో కలిసి గ్రామ బీ ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 6500 రూపాయలు మరియు 100కేజీల బియ్యం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ అధైర్య పడొద్దు ధైర్యంగా ఉండాలని మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గణేష్, మాజీ వార్డ్ మెంబర్స్ మహేందర్, మల్లేష్, జంగయ్య, సాయిలు, సత్యనారాయణ గౌడ్,రాజు, రమేష్ , గ్రామ పెద్దలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ బిల్లును వెంటనే ఆమోదించాలి



**మాడుగుల, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపినట్లు యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కొప్పుల శేఖర్ గౌడ్ తెలిపారు. ఈ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి వెంటనే ఆమోదించాల్సిన బాధ్యత కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై ఉందన్నారు.బీసీల హక్కులు రాజ్యాంగబద్ధమైనవని, వాటిని వాయిదా వేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ కోసం సాగుతున్న పోరాటం ఆత్మగౌరవ పోరాటమని పేర్కొన్నారు.

## విజయ వంతంగా ముగిసిన కుట్టుమిషన్ శిక్షణ

**-పీపుల్స్ సర్వీస్ వారి ఆధ్వర్యంలో...20 మందికి శిక్షణా పత్రాలు అందజేత**
**-శిక్షణ కేంద్రానికి కుట్టు మిషన్లు అందజేసిన సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోపిశంకర్ యాదవ్**






**అబ్దుల్లాపూర్ మెట్టు,అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** హయత్ నగర ని వినాయక్ నగర్ లో పీపుల్స్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు దుంపాల సారిక 20 మంది మహిళలకు కుట్టు మిషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. విజయ వంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు... సర్టిఫికెట్లు కూడా అందించడం జరిగింది. ఈ కుట్టు మిషన్ కేంద్రాన్ని సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్ సందర్శించి. రెండు కుట్టు మిషన్లు ను బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహుకులు సారిక, హేమలత సురక్ష కార్యాలయం లో గోపి శంకర్ ను కలిసి... సన్మానించడం జరిగింది.

## బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలి

**-కొత్త కురుమ మంగమ్మ**




**అబ్దుల్లాపూర్ మెట్టు, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అంబేద్కర్ చౌరస్తాలో బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ కొత్త కురుమ మంగమ్మ శివకుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మోడీ ప్రభుత్వం నిరంకుశ వైఖరిని వీడి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. సీపీఎం సీపీఐ, బీఎస్పీ నాయకులు, కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పోస్టుమాన్ సిబ్బందికి జాగృతి పత్రిక సన్మానం



**కరీంనగర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాగృతి తెలుగు జాతీయవాద వార పత్రిక ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ ప్రధాన తపాల కార్యాలయంలో పోస్టుమాన్ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. దేశ సేవలో ప్రతి వృత్తి ఒక సాధనమని, పోస్టుమాన్ సేవలు సమాజానికి అత్యంత సమీపంగా ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.చందాదారులకు పత్రికను సకాలంలో అందించడంలో పోస్టుమాన్‌లు చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయమని తెలిపారు. గత రెండేళ్లుగా రెయిన్‌కోట్లు, వాటర్ బాటిల్స్, గొడుగులు, టవల్స్ వంటి అవసరమైన వస్తువులు అందజేస్తూ సేవలకు గౌరవం తెలుపుతున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో పోస్ట్మాస్టర్ తిరుపతి, దావులూరి మురళీధర్, శ్రీనివాస్, ఓదెల మల్లికార్జున్, బట్టు వెంకటేష్, భూమ్ రావు, ఓరుగంటి విష్ణు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## బీసీల పట్ల కాంగ్రెస్ కపట ప్రేముగంగాడి కృష్ణారెడ్డి



**కరీంనగర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమను ప్రదర్శిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. బీసీ బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందన్నారు.బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత లేకుండా, బడ్జెట్‌లో కేటాయింపులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కులగణన సర్వే అప్రమాణికంగా, రాజకీయ ఉద్దేశాలతో నిండిపోయిందని విమర్శించారు.బీసీలకు న్యాయం చేయగల సామర్థ్యం బీజేపీ ప్రభుత్వానిదేనని, ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించి చరిత్ర సృష్టించిందన్నారు. 2027లో జరగబోయే జనగణనను శాస్త్రీయంగా, డిజిటల్ ఆధారాలతో నిర్వహించేందుకు మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

## జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం




**జీడిమెట్ల, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పోలీస్ అమలువీరుల దినోత్సవం సందర్భంగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. తలసేమియా బాధిత చిన్నారుల కోసం సీఐ గడ్డం మల్లేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ ప్రారంభించారు రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు, హెల్మెట్లు అందజేశారు. ఈ శిబిరంలో 400 మంది పాల్గొన్నారు. రక్తదాతలను ఏసీపీ నరేష్ రెడ్డి, సీఐ మల్లేష్ అభినందించారు. ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది కూడా రక్తదానంలో పాల్గొన్నారు.

## బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

**-పులి ఆంజనేయులు గౌడ్**



**కరీంనగర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్‌తో బీసీ జేఏసీ పిలుపు మేరకు రాష్ట్ర బంద్‌లో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. టవర్ సర్కిల్, రాజీవ్ చౌక్, బస్ స్టాండ్, కోర్ట్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో బంద్ నిర్వహించారు.జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూబీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా అడ్డుకుంటోందన్నారు. బీజేపీ ఎంపీలకు చిత్తశుద్ధి ఉంటే ప్రధాని మోదీని ఒప్పించి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వెలిచాల రాజేందర్ రావు, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సత్తు మల్లేశం, పద్మకర్ రెడ్డి, అంజన్ కుమార్, ఎస్.కె. సిరాజ్ హుస్సేన్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## బంద్‌లో పాల్గొన్న వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు బీసీ సంఘాలు చేపట్టిన రాష్ట్ర బంద్‌లో భాగంగా శనివారం కరీంనగర్లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు. రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, ప్రకాశం గంజు తదితర ప్రాంతాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ కల్పించడంలో వైఫల్యం చెందిందని రాజేందర్ రావు విమర్శించారు.

# బీసీ బంద్‌కు బీజేపీ మద్దతు

-బోయిన్పల్లి ప్రవీణ్ రావు




**కరీంనగర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాలు చేపట్టిన బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కరీంనగర్ బీజేపీ శ్రేణులు బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూకామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిందన్నారు. 42 శాతం రిజర్వేషన్ అంశాన్ని రాజకీయ నాటకంగా మార్చిందని విమర్శించారు. కులగణన సర్వే శాస్త్రీయత లేకుండా నిర్వహించి, అసంబద్ధమైన దస్త్రాన్ని గవర్నర్‌కు పంపి తప్పించుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ కపట ప్రేమను బీసీలు గుర్తించాలన్నారు.

# పంజాబ్ వరద ప్రాంతాల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటన



**కరీంనగర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పంజాబ్‌లో వరద ప్రభావిత ప్రాంతాలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం సందర్శించారు. గురుదాస్‌పూర్ జిల్లాలోని భారత్ పాకిస్తాన్ సరిహద్దు గ్రామాల్లో పర్యటించి, వరద బాధితులతో మాట్లాడారు. బీఎస్ఎఫ్ జవాన్ల సేవలను ప్రశంసించిన మంత్రి, 'మోదీ కిట్‌లు' పంపిణీ చేశారు. రావి నది వరదల వల్ల వేల ఎకరాల భూమి సాగుకు పనికిరాకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రులు ఇప్పటివరకు తమ గ్రామాలకు రాలేదని, కేంద్రమే ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. పంజాబ్‌కు తక్షణ సహాయంగా 1,600 కోట్లు, ఎన్‌డిఆర్ఎఫ్ కింద 1,200 కోట్లు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. వరదల్లో ఇళ్లు కోల్పోయిన వారికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు, నష్టాలపై పూర్తి నివేదిక అనంతరం పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## దుర్శేడ్‌లో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ



**కరీంనగర్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దుర్శేడ్‌లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల భూమి పూజ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజా పాలనలో దరఖాస్తు చేసిన మిగిలిన అర్హులకు కూడా ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతోందని, బీఆర్ఎస్ పాలనలో మాటల గారడే తప్ప ప్రజలకు ప్రయోజనం లేదని విమర్శించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిని తిరుపతి, మండల అధ్యక్షుడు కంరెడ్డి రాంరెడ్డి, గాజుల అంజయ్య, మీసాల సాయిలు, బుర్ర హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ బిచ్చం కాదు-అంకు సురేందర్



**వంగూరు, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన బీసీ బంద్‌లో భాగంగా వంగూరు మండల కేంద్రంలోని శ్రీశైలం జాతీయ రహదారిపై బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ జిల్లా నాయకుడు అంకు సురేందర్ మాట్లాడుతూబీసీ రిజర్వేషన్ బిచ్చం కాదు, రాజ్యాంగబద్ధ హక్కు అని స్పష్టం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో బీసీ బిడ్డలు అవసరం అయితే, ప్రజాప్రతినిధుల పదవులకు ఎందుకు అర్హత ఇవ్వకూడదని ప్రశ్నించారు. వెనకడుగు వేసే ప్రసక్తి లేదని, అన్ని విధాలుగా పోరాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని బీసీ సంఘాల నాయకులు, అన్ని పార్టీలకు చెందిన బీసీ నేతలు పాల్గొన్నారు.

# బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలి

ఉల్లంపల్లిలో బీసీ జేఏసీ డిమాండ్



**చిగురుమామిడి, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో బీసీ జేఏసీ పిలుపు మేరకు విద్యా సంస్థలు బంద్ నిర్వహించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ అధ్యక్షుడు సుదగోని రాజు గుడ్, ప్రధాన కార్యదర్శి చీమ్మర్తి తిరుపతి, వైస్ ప్రెసిడెంట్ బుర్ర సంపత్ కుమార్ గౌడ్, యూత్ ప్రెసిడెంట్ జనవేని అనిల్, కాంగ్రెస్ అధ్యక్షుడు కానవేణి శివకుమార్, టీఆర్ఎస్ అధ్యక్షుడు రాగుల వెంకన్న, నాయకులు కే బాలయ్య, నారాయణ, ఓదయ్య తదితరులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం నేతలు మాట్లాడుతూరిజర్వేషన్ల సాధన కోసం పోరాటం ఆచరణలో అమలయ్యే వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన అద్దంకి సునీత



**ఉప్పునుంతల, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉప్పునుంతల మండల తహసీల్దారుగా అద్దంకి సునీత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూరెవెన్యూ సమస్యలు, భూముల వివాదాల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తానని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

# జాతీయ అవార్డ్ గ్రహీతకు ఎమ్మెల్యే విజయ రమణారావు సన్మానం



**ఎలిగేడు, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని తన నివాసంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు శనివారం జాతీయ పురస్కార్ గ్రహీత సంపత్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. సుల్తానాబాద్ మండలం గట్టపల్లి గ్రామానికి చెందిన సంపత్ కుమార్ 52 గ్రంథాలు రచించి, తెలంగాణ భాషపై విశేష పరిశోధన చేసినందుకు కాళోజి నారాయణరావు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో కరాటే, యోగా విద్యల్లో గుర్తింపు పొందిన సంపత్ కుమార్ 68 సార్లు రక్తదానం చేసి, వివిధ రంగాల్లో సామాజిక సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దన్ నాయక్ దామోదర్ రావు, మాజీ సర్పంచ్ కొలిపాక పెద్దన్న, మాజీ ఎంపిటిసి శంకర్, కదంబపూర్ మాజీ సర్పంచ్ కొడెం అజయ్, ఆవోప జిల్లా కార్యదర్శి పల్ల సురేష్, శ్రీనివాసరావు, నగునూరి వెంకటేశం తదితరులు సంపత్ కుమార్‌ను అభినందించారు.

# బీసీ బిల్లుకు అసలైన శత్రువు బీజేపీ ప్రభుత్వం

-ఎస్ఎండి ఫయాజ్



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర బీసీ బంద్‌లో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ పాల్గొన్నారు. 42% బీసీ రిజర్వేషన్ బిల్లుకు అసలైన శత్రువు ఎన్డీఏ ప్రభుత్వమేనని ఆయన విమర్శించారు. బీజేపీ మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ బీసీ బిల్లుపై ఢిల్లీలో ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల కోసం జరుగుతున్న ఉద్యమం మరో తెలంగాణ ఉద్యమంలా రూపాంతరం చెందాల్సిన అవసరం ఉందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్య కార్యాచరణ ద్వారా ఉధృతంగా పోరాటం సాగించాలన్నారు. ఈ సందర్భంగా సిపిఐ శ్రేణులు బంద్‌కు మద్దతు ప్రకటించి, మోటార్ సైకిల్ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో మారేడు శివశంకర్, కపిలవాయి గోపిచారి, కేశ మౌని ఆంజనేయులు, చిన్నపాక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# వంగూరులో బీసీ బంద్ ప్రశాంతం



**వంగూరు, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ బీసీ బంద్‌కు మద్దతుగా వంగూరు మండల కేంద్రంలో అన్ని పార్టీల నాయకులు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బంద్‌కు మద్దతు తెలిపారు. మండల బీసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. జువ్వ కృష్ణయ్య, పూలయ్య యాదవ్, నరేందర్ గౌడ్, ఎల్లగౌడ్, గాఫూర్, జనార్దన్, బాలస్వామి గౌడ్, హమీద్, సైదులు, శ్రీనివాస్ గౌడ్, మీసాల స్వామి, మలేష్ యాదవ్, దశరథ, షాయులు, మురళి, రమేష్, సురేష్, మధు, రాఘవేంద్రర్, రాములు, శివ గణేష్, ఆనంద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి లో బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ బంద్ విజయవంతం



**చింతపల్లి, అక్టోబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ బంద్ పిలుపు నేపథ్యంలో చింతపల్లి మండల కేంద్రంలో శనివారం బీసీ రిజర్వేషన్ల కోసం బంద్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మాజీ ఎంపిటిసి ఎల్లంకి వరలక్ష్మి అశోక్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించి, ఆ బిల్లును గవర్నర్ గారికి పంపించి పార్లమెంటుకు చేరవేసిందని తెలిపారు. ఇక ఆ బిల్లును ఆమోదించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. బీసీలకు న్యాయం చేయాలంటే రాజకీయ పార్టీలన్నీ కలసికట్టుగా కృషి చేయాలని ఎల్లంకి వరలక్ష్మి అశోక్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీసీలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నాగేష్, మల్లారెడ్డిపల్లి మాజీ ఎంపిటిసి ఎరుకల వెంకటయ్య గౌడ్, వింజమూరు మాజీ సర్పంచ్ డి. మోహన్, నసర్లపల్లి కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు దాసరి రాజు, కోడి దాల శ్రీను, వెన్నం శేఖర్, కె. రామకృష్ణ, శివర్ల రమేష్, చేనమోని రాములు, కొప్పుల వెంకటయ్య, మాసని సైదులు, పల్ల వెంకటయ్య, దూదిమెట్ల శీను, డి. ప్రసాద్, ఎల్లంకి రాధాకిషన్, లింగంపల్లి వెంకటయ్య, సలీం తదితరులు పాల్గొన్నారు.